

వార్త
ఆదివారం
2 ఏప్రిల్, 2023
సమ్మర్ సిగలు

# బాలయ్యకు జోడీగా కాజల్



సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన టాలీవుడ్ అగ్ర హీరోయిన్ కాజల్ అగర్వాల్ వరుస సినిమాలతో బిజీగా మారింది. ఇప్పటికే కమల్‌హాసన్‌కి జంటగా 'ఇండియన్ **2**'లో నటిస్తున్న ఆమె తాజాగా మరో భారీ ప్రాజెక్ట్‌లోకి వచ్చింది. నందమూరి బాలకృష్ణ కథానాయకుడుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో ఆమె హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ విషయం చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. సాహు గారపాటి, హరీశ్ పెద్ది నిర్మిస్తున్న ఈ చిత్రంలో యువ నటి శ్రీలీల కీలకపాత్ర పోషిస్తోంది. ఆమె బాలకృష్ణకు కూతురుగా కనిపించనున్నట్లు సమాచారం.

## తారాతీరం

# లారెన్స్ కథానాయకుడుగా 'రుద్రుడు'



ఇటీవలి కాలంలో తెలుగు ప్రేక్షకుల ముందుకు లారెన్స్ సినిమా రాలేదు. లారెన్స్ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఆయన కథానాయకుడిగా 'రుద్రుడు' చిత్రం రూపొందించింది. ఈ చిత్రానికి కథిరేసన్ దర్శక, నిర్మాతగా వ్యవహరించాడు.
యాక్షన్ థ్రిల్లర్ జోనల్లోఈ సినిమా పలకరించనుంది. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ సినిమాకి సంగీతం సమకూర్చాడు. లారెన్స్ జోడీగా ప్రియాభవాని శంకర్ అలరించనుంది. 'కల్యాణం కమనీయం' చిత్రంతో ఆమె తెలుగు తెరకి పరిచయమైంది. ఇతర ముఖ్యమైన పాత్రలలో శరత్‌కుమార్, పూర్ణిమ భాగ్యరాజ్ కనిపించనున్నారు. ఏప్రిల్ **14**వ తేదీన ఈ సినిమా విడుదల కానుంది.

ఆదివారం వార్త

sunmagvaartha@gmail.com

2 ఏప్రిల్, 2023

## మంచి ముత్యాలు

మనసును చలింపచేసే అన్ని అవలక్షణాలను మనం ఎప్పుడు దూరం చేస్తామో, అప్పుడు సంతోషాన్ని సొంతం చేసుకోగలం.

- అనుభవానంద స్వాములు

## విషయ విశేషం


సింగారాల 'సిగ'... 4

'సంఘీ'భావం....5

ఇకనైనా దూషణ ప్రసంగాలకు అడ్డుకట్టపడేనా?

కవర్ స్టోరీ..6

సమ్మర్ సెగలు

నవ్వకుంటే జైలుశిక్షే..10

ఈవారం కవిత్వం..12

ప్రేమమెట్ల పియానో

మీ మొబైల్ సురక్షితమేనా?......18

కథ.. 20

సముద్ర తీరం

సాహిత్యం...23

కవితాక్షరాల జ్వాలాతోరణం 'అలిశెట్టి'

వింతలకు నెలవు 'డెడ్ సీ' ...25

మౌనమే నీ భాష..30

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

నవ్వుల్.. రువ్వుల్..

వగైరా..వగైరా..


# తాజా వార్తలు

## కళాన్ని పూజిస్తారు



తెలుగు భాషకి ఆదికవి నన్నయ్య. ఆయన ఆంధ్ర మహాభారతాన్ని రాసిన ఘంటం మన దగ్గర ఉందంటే ఎలా? అని ఆశ్చర్యపోతాం. కానీ మలయాళ ఆదికవి తుంచత్తు ఎళుత్తచ్చన్ వాడిన ఘంటం భద్రంగా దాచారక్కడ. దాచడమే కాదు.. దానికి ఏటా ఉత్సవం నిర్వహించి, ఊరేగింపూ జరుపుతారు. ప్రపంచంలో ఓ కవి వాడిన కలాన్ని ఇలా ఊరేగించడం ఇంకెక్కడా లేదంటారు కేరళీయులు. ఎళుత్తచ్చన్ పదహారో శతాబ్దంవాడు. ఆయన సంస్కృత రామాయణాన్ని మలయాళ భాషలో 'ఆధ్యాత్మిక రామాయణం' అన్న పేరుతో రాశారు. నేటి మలయాళ లిపిని పరిచయం చేసింది ఆయనే. అందుకు కృతజ్ఞతగా ఎళుత్తచ్చన్ కోసం సుమారు ఐదు ఎకరాల్లో ప్రత్యేక క్షేత్రాన్ని నిర్మించారు.




ఇది సుమారు ఎళుతచ్చన్ గుడిలాంటిదే. కానీ ఇక్కడ ఆయన విగ్రహంగానీ చిత్రపటంగానీ ఏదీ ఉండదు. ఆయన వాడిన ఘంటాన్నే పూజిస్తారు. ఏటా మాఘమాసంలో దానికి పెద్ద ఎత్తున ఉత్సవం నిర్వహిస్తారు.

### మూలవిరాట్టును చూడకూడదట!

భక్తులు ఎంతో ప్రయాస పడి ఎక్కడెక్కడో ఉన్న ఆలయాలకు వెళుతుంటారు. అక్కడికి వెళ్లిన తరువాత తీరా దర్శనం సమయంలో కళ్లు మూసుకుని దండం పెట్టుకుంటారు. దైవాన్ని చూసే అవకాశం ఉన్నా కళ్లు మూసుకుంటారు. అదే ఉత్తరాఖండ్ దేవల్ డెవలప్‌మెంట్ బ్లాక్‌లోని 'వాన్' గ్రామంలో ఉన్న 'లాతు' దేవుడి ఆలయంలో మాత్రం స్వామి ప్రతిమను చూడ్డానికి వీలు లేదు. ఏప్రిల్-మేలో వచ్చే వైశాఖ పౌర్ణమిరోజున మాత్రమే తెరుచుకునే ఆ ఆలయంలో పూజారి కళ్లకు గంతలు కట్టుకునే పూజలు నిర్వహిస్తుంటాడు. నందాదేవి సోదరుడైన లాతు దేవుడిని మణి ధరించిన నాగరాజు పెనవేసుకుని ఉంటాడట. ఆ రూపాన్ని చూడకుండా నాగరాజు బుసల్ని వినకుండా ఉండటానికే గంతలు కట్టుకుంటారట. అంతేకాదు, వేలాదిగా తరలివచ్చే భక్తులు గుడి బయటే దేవుడికి నమస్కరించుకుని ఉత్సవాలు జరుపుతారు.







# సింగారాల 'సిగ'

జుట్టు అందమంతా కొప్పుతోనే ముడిపడి ఉందంటారు. కానీ ఫ్యాషన్ రంగంలో కాలక్రమంలో సరికొత్త హెయిర్ స్టైల్స్ పుట్టుకొచ్చాయి. ఫ్యాషన్ ప్రపంచంలో ఎప్పటికప్పుడు కొత్తదనం వస్తుంటుంది. అందుకే పాతవాటికి కొత్త డిజైన్లు అద్దుతుంటారు. అందులో భాగంగానే కొప్పు సింగారం మళ్లీ ఈ తరాన్నీ పలకరించేసింది. చీరెకట్టుకు సిగ(కొప్పు) కచ్చితంగా నప్పుతుంది. చూసినవాళ్లంతా 'కొప్పు చూడు కొప్పందం చూడు' అంటూ





పొగడకుండా ఉండలేరు. ఇప్పటి అమ్మాయిలకు తగ్గట్టు పోనీటెయిల్ వున్నా కొప్పు పెట్టుకునేలా రెడీమేడ్ ముడులొచ్చాయి. ఇప్పుడు వాటిల్లోనే అలంకరించినవీ దొరుకుతున్నాయి. కురుల్ని మూడు సార్లు అలా తిప్పి ఇలా ముడి వేసుకుంటే సరిపోదు. ఆ కొప్పు కుదురుగా రావాలంటే దానికి ఎంతో ఓర్పూ, నేర్పూ కావాల్సిందే. దాని అలంకరానికి ఎంతో సమయమూ అవసరం.

పెళ్లికో పేరంటానికో ప్రత్యేక ఆకర్షణగా నిలవాలంటే చక్కని చీరె కట్టి, హుందాతనాన్ని వెంటతెచ్చుకునే కొప్పు వేసుకోవడమంటేనే మాకిష్టం అంటున్నారు కొందరు అమ్మాయిలు. అలాంటివారి అభిరుచి మేరకు ఆ పనిని క్షణాల్లో చేసిపెట్టడానికి ఇదివరకు కొప్పుల క్లిప్పులు వస్తే ఇప్పుడు స్టోన్ వర్క్, ఆర్టిఫిషియల్ ఫ్లవర్ డెకరేషన్, యాక్సెసరీస్‌తో రెడీమేడ్ బన్స్(కొప్పులు) వచ్చాయి. ఎలాస్టిక్ బ్యాండ్‌లా సాగే ఈ కొప్పును మన ముడిపైన తగిలించుకుంటే చాలు. రకరకాల ముత్యాలు, మెరిసే రాళ్లు, రంగుల పూలు, చిన్న చిన్న క్లిప్పులతో తయారు చేసి ఆ కొప్పులు సిగకి ప్రత్యేక సింగారం అవసరమే లేకుండా చేస్తున్నాయి.

కట్టూ బొట్టూతో పాటు జుట్టు రంగుకీ సరిపోయేట్టుగా వేరు వేరు జడపాయల అల్లికలు, అలంకారాలతో దొరుకుతున్నాయి డెకరేటివ్ బన్స్. విడివిడిగా కొప్పు అందాన్ని పెంచే హెయిర్ యాక్సెసరీలు పెట్టుకుని అవి సరిగ్గా అమరాయో లేదో కాసేపటికి పడిపోతాయేమో అంటూ సందేహాలు పెట్టుకోకుండా నిశ్చింతగా ఉండొచ్చు. ఏదైనా ఫంక్షన్ వెళుతుంటే గంటల సమయం వెచ్చించకుండానే పిన్నులు, జడబిళ్లలు పెట్టుకోకుండా ఈ ఒక్క కొప్పును అలా తగ్గించేసుకుంటే జడ సింగారం పూర్తయినట్లే. ❑



# 'సంఘీ' భావం



## ఇకనైనా దూషణ ప్రసంగాలకు అడ్డుకట్ట పడేనా?

రాజకీయ నాయకులు తమ ప్రసంగాల్లో పదును పెంచేందుకు పరిధి దాటి వ్యవహరిస్తున్నారు. వ్యవస్థ పైనా, ప్రత్యర్థి పార్టీల విధానాలు, ప్రతిపక్ష నేతల వ్యవహార శైలిపై విమర్శనాత్మక ప్రసంగాలను పక్కన పెట్టి వ్యక్తిగత దూషణలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు.

కొన్ని సందర్భాల్లో వ్యక్తులను కించపరిచే విధంగా ప్రకటనలు చేస్తున్నారు. తాజాగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ గత ఎన్నికల సమయంలో చేసిన ప్రసంగాలపై సూరత్ కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. దీనితో ఒక్కసారిగా కాంగ్రెస్ పార్టీతో పాటు అన్ని రాజకీయ పక్షాల్లో తీవ్రస్థాయిలో అంతర్మథనం ప్రారంభమైంది. కోర్టులో కేసు రుజువు అయితే ఆరు సంవత్సరాల పాటు ఎన్నికల నుంచి బహిష్కరించే అవకాశం ఉంటుంది. ఈ ఆరు సంవత్సరాల కాలంలో శిక్షా కాలాన్ని కలపకుండా లెక్కించాలని ఎన్నికల నిబంధనలు పేర్కొంటున్నాయి. ఉదాహరణకు రెండేళ్ల జైలు శిక్షను కోర్టు విధిస్తే దానికి ఆరు సంవత్సరాలు కలిపి 8 సంవత్సరాల పాటు ఎన్నికలకు దూరంగా ఉండాల్సి ఉంటుంది. ఇంతటి కఠినతరమైన నిబంధనలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు న్యాయస్థానాలు, ఎన్నికల కమిషన్ వాటి అమలు పట్ల శ్రద్ధ చూపకపోవడంతో నేతల ప్రసంగాలు గాడి తప్పుతున్నాయి. నిబంధనలు ఎన్ని ఉన్నా వాటిని సక్రమంగా అమలుచేసే సత్తా కలిగిన నేతలు వస్తేనే వాటికి విలువ ఉంటుంది. ఉదాహరణకు టిఎన్ శేషన్ వచ్చేవరకు ఎన్నికల కమిషన్‌కు అంత శక్తి ఉందా? అన్న విషయం వెలుగులోకి రాలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డిజిపిగా ఉన్న సీనియర్ ఐపిఎస్ అధికారి మహంతి ఎన్నికల సమయంలో వ్యవహరించిన తీరు ఎన్నికల కోడ్ అతిక్రమించేందుకు ప్రయత్నించేవారికి ముచ్చెమటలు పట్టాయి. ఇటువంటి ఉదాహరణలు చాలా ఉన్నాయి. విజన్ ఉన్న అధికారులకు సరైన స్థానం అందిస్తే సంస్కరణల పరంగా అద్భుతాలను చేయగలరని అనేక సందర్భాల్లో రుజువు అయ్యింది. పట్టించుకునేవారు లేకపోవడంతో కొందరు నేతలు ప్రాంతీయ వాదాన్ని రెచ్చగొట్టి లబ్ది పొందుతామని ప్రయత్నిస్తే మరికొందరు మతపరమైన విద్వేషాలు రెచ్చగొట్టి ప్రయోజనం పొందాలని కుట్రలు చేస్తున్నారు. పలు సందర్భాల్లో కొందరు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేసినా రాజకీయ వత్తిడిల కారణంగా వాటిని పట్టించుకోవడం లేదు. అధికారంలో ఉన్న పార్టీ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తేనేగానీ పోలీసులు రంగంలోకి దిగి కేసులు నమోదు చేయడం లేదు. ఇవి కూడా కేవలం ప్రతిపక్ష నేతలకు మాత్రమే వర్తించేలా పోలీసులు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నేతలు, ఆ పార్టీ మిత్రపక్ష నేతలు మతాలను ఎంతగా రెచ్చగొట్టినా పోలీసులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇక కొన్ని సందర్భాల్లో నేతలు వేదికలు ఎక్కి తమ ప్రత్యర్థి నాయకులను ఇష్టం వచ్చినట్లు అసభ్య పదజాలంలో విమర్శిస్తున్నారు. మీడియాలో ప్రచురించడానికి అలవికాని భాషను ప్రయోగిస్తున్నారు. ప్రత్యర్థి వ్యక్తుల శరీరక లోపాలను సైతం ఎత్తి చూపుతూ ప్రసంగిస్తున్నారు. మహిళల పట్ల అసభ్య పదజాలాన్ని ఉపయోగిస్తున్నారు. కొందరు మహిళా నేతలు, మహిళా మంత్రులు కూడా చాలా సందర్భాల్లో పరిధికి మించి అసభ్య పదజాలాన్ని ఉపయోగిస్తున్నారు. ఇవి కేవలం బయట జరిగే బహిరంగ సభల్లోనే కాదు అసెంబ్లీలో కూడా ఇదే పదజాలాన్ని ఉపయోగిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల కాలంలో ఈ వైఖరి ఎక్కువగా కనిపిస్తోంది. ఒక నాయకుడి భార్యపై సైతం దిగజారుడు విమర్శలు చేయడం సంచలనం కలిగించింది.

ఇలాంటి పరిస్థితి పలుమార్లు అసెంబ్లీలో వివిధ సందర్భాల్లో కొనసాగుతూనే ఉంది. సుమారు దశాబ్దం క్రితం పార్టీ నేతలు కొంత హుందాగా వ్యవహరించేవారు. కింది స్థాయి నేతలు పరిధి మించి ప్రసంగిస్తే అగ్రనేతలు, అధిష్ఠానం హెచ్చరికలు జారీ చేసేది. అయితే ప్రస్తుతం అందుకు విరుద్ధమైన పరిస్థితి కనిపిస్తోంది. అగ్రనేతలే అసభ్య పదజాలాన్ని, వ్యక్తిగత దూషణలను చేస్తున్నారు. మరికొందరు ట్విట్టర్ వేదికగా ప్రత్యర్థులను కించపరిచే విధంగా వ్యాఖ్యానాలు చేస్తున్నారు. ఎదుటి వ్యక్తిని వ్యక్తిగతంగా దూషిస్తేనే మంచి వక్తగా గుర్తింపు వస్తుందని, సభికులు స్పందిస్తారన్న భావన నేతల్లో పెరిగిపోతోంది. అయితే ఇటువంటి ప్రసంగాలు చేసే నాయకులు సమాజంలో చులకన అవుతారు. క్రమంగా వీరి మాటకు గౌరవం పోతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో అధికార పార్టీకి చెందిన ఒక నేత అసభ్య పదజాలాన్ని ఉపయోగించి విమర్శలు చేయడం సర్వసాధారణంగా మారింది. మీడియాలో కొంతకాలం ఈయన ప్రసంగాలు ఎడిట్ చేసి ప్రసారం చేసేవారు. అయితే క్రమంగా ప్రస్తుతం దాదాపుగా ఇలాంటి ప్రసంగాల ప్రసారాన్ని నిలిపివేశారు. తెలుగు రాష్ట్రాల్లో అసభ్యపదజాలంలో ప్రసంగాలు చేసినప్పుడు, మతాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినప్పుడు అడపాదడపా కేసులు నమోదు అవుతున్నా రాజకీయ వత్తిళ్ల కారణంగా వాటిని నిర్వీర్యం చేస్తున్నారు. ప్రస్తుతం సూరత్ కోర్టు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రుజువు కావడంతో రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువడ టంతో ఒక్కసారి ఈ అంశం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. ఇకనైనా పరిధి దాటి విమర్శలు చేసే నేతలు తమ వైఖరిని మార్చుకునే ప్రయత్నం చేస్తే మంచిది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# సమ్మర్ సెగలు

**సూర్యుడి చుట్టూ భూమి ఒక నిర్ణీత కక్ష్యలో దీర్ఘ వృత్తాకారంలో తిరగడం వల్ల మనకు ఋతువులు ఏర్పడతాయని, ఆ క్రమంలో మనకు భూమి మీద కాలాల ప్రభావం కనిపిస్తుందని మనందరికీ తెలిసిందే. ఆ క్రమంలో మనకు వానాకాలం, శీతాకాలం, ఎండాకాలం ఏర్పడతాయని ఆయా కాలాలన నుసరించి మన జీవన విధానం ఉంటుందని మనకు తెలుసు.**

అయితే అతి వేగంగా మారుతున్న పరిస్థితుల వలన, మానవుడి అతి తెలివితేటల వలన జీవ విధానంపై విపరీత ప్రభావం పడుతుంది. దానితో నిత్యం మనం కొత్త సమస్యలను కొనితెచ్చుకుంటున్నాం.

అభివృద్ధి పేరిట మనం పర్యావరణంపై చేసే యుద్ధంతో ప్రస్తుతం గెలిచినట్టు అనిపిస్తున్నా చివరకు మానవుడు ఓడిపోక తప్పదు. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని కొంచెం జాగ్రత్త పడకపోతే రాబోయే రోజుల్లో వినాశనం తప్పదేమో అనిపిస్తుంది. నిశితంగా పరిశీలిస్తే ఈ మధ్య కాలంలో అనేక రుజువులు దొరుకుతున్నాయి. అయినప్పటికీ మానవుడు ఆ క్రమంలో ఎటువంటి చర్యలు తీసుకుంటున్నట్టు దాఖలాలు లేవు. ఎక్కడో ఒకరు ఇద్దరూ లేకపోతే ఏదైనా సంస్థ కార్యరూపంలో దిగినా ఆశలన్నీ అడియాసలు అవుతున్నాయే తప్ప పెద్దగా ప్రయోజనం ఉండడం లేదు.

## నిపుణుల హెచ్చరిక

ఈ మధ్యనే ప్రస్తుత వేసవికాలం చాలా హాట్‌గా ఉంటుందని భారత వాతావరణ శాఖ ఇప్పటికే వెల్లడించింది. దానికి తగ్గట్టే ఎండలు భయంకరంగా మండిపోతున్నాయి. మార్చి, మే వరకు వేసవి ఎలా ఉంటుందో అంచనా వేసిన భారత్ వాతావరణ శాఖ భారతదేశం లోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఈ సంవత్సరం మార్చి నెల రాకముందే వాతావరణం వేడిగా మారింది. గత కొన్ని రోజులుగా చూస్తే వాతావరణంలో అనేక మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. భానుడి భగభగలతో పట్టపగలు ఇప్పటినుండే చుక్కలు కనిపిస్తున్నాయి. ఇకముందు ఎండాకాలం ఎలా ఉంటుందో అన్న ఆందోళన ఇప్పటి నుండే జనాలకు కలుగుతుంది. చత్తీస్ ఘడ్, ఒడిశా, గుజరాత్, మహారాష్ట్ర, గోవా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో రాబోయే రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రత కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు కనిపించే అవకాశం ఉండవచ్చు అనేది వాతావరణ శాఖ అంచనా.

## మండే ఎండలు

తెలుగు రాష్ట్రాలతో పాటుగా దేశంలో పలు రాష్ట్రాల్లో ఎండలు విపరీతంగా మండిపోతున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండలు ఇంతలా ఉంటే రాబోయే రోజుల్లో ఎలా ఉంటుందో? అనే భయం సామాన్య జనాలలో కనిపిస్తుంది. మార్చి రెండవ వారంలోనే వేసవి తాపం విపరీతంగా పెరిగింది. 40 డిగ్రీల సెల్సియల్స్ మార్చిలోనే దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. ఏది ఏమైనా ఈసారి రోళ్లు పగిలే ఎండలు ఉండటం ఖాయమే అన్న అభిప్రాయం ఇప్పటినుండే వ్యక్తం అవుతుంది. సాధారణ కాలానుగుణ గరిష్ట ఉష్ణోగ్రతలు దక్షిణ ద్వీపకల్పం అయిన

**కవర్ స్టోరీ**

**కాళంరాజు వేణుగోపాల్**

ఇండియాలో, పక్కనే ఉన్న మధ్య భారతదేశం చాలా ప్రాంతాలపై ఎక్కువగా ఉంటాయని వేసవికి సంబంధించిన ముందస్తు అంచనా తెలిపింది. ఇది ఈ సమ్మర్ చాలా హాట్‌గా ఉండవచ్చు అని పేర్కొంది. ఏప్రిల్ నుండి జూన్ వరకు రెండవ వేసవి అంచనాను ఏప్రిల్‌లో వాతావరణ శాఖ విడుదల చేస్తుంది. ఎండల కారణంగా గోవాలో, తెలంగాణలో మరికొన్ని రాష్ట్రాలలో బడులని ఒంటిపూట నిర్వహిస్తున్నారు. రాబోయే రోజుల్లో వేడిగాలులు చాలా ఎక్కువగా పెరిగే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ శాఖ అంటోంది. మార్చిలో పలు ప్రాంతాలలో 50 డిగ్రీల ఉష్ణోగ్రత కు చేరే అవకాశం ఉంటుందన్నారు.

## మండే ఎండల ప్రభావం ఎంత?

రోజురోజుకి ఎండలు పెరిగిపోతున్నాయి. సూర్యుడు తన ప్రతాపం చూపడం మొదలుపెట్టాడు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం ఇప్పటికే చాలా మంది వడదెబ్బకి గురై వాంతులు, విరోచనాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. కరోనా కారణంగా మనుషులలో రోగ నిరోధక శక్తి తగ్గడం, కొత్త సమస్యలు ఎదురవడం మనం చూస్తున్నాం. అలాంటి సమయంలో పెరిగే ఈ ఉష్ణోగ్రతలు కచ్చితంగా మనపై ప్రభావం చూపించక తప్పదని అర్థమవుతుంది. మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్తే ఆ సమయంలో సూర్యుడు సరిగ్గా నడి నెత్తిన ఉంటాడు. అప్పుడు సూర్య కిరణాలు నేరుగా తలపై పడటం వల్ల తలనొప్పి రావడంతో పాటు కొన్ని సార్లు వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంది. తల తిరగడం, బ్లడ్ ప్రెషర్ తగ్గటం లేదా పెరగటం, చర్మం పొడిబారడం, వికారంగా అనిపించడం, వాంతులు రావడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, గుండె వేగం పెరగడం. మన శరీరంలో 70 శాతం నీరే ఉంటుంది. తగినంత నీటిని తీసుకోకపోతే శరీరంలో అవసరమైన ద్రవాలను కోల్పోతుంది. ఇది అనేక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది.

### వడదెబ్బ

శరీరం 32 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతను తట్టుకుంటుంది. ఎండలో తిరగడం వల్ల 35 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు చేరుకుంటే వడదెబ్బ సమస్య ఏర్పడుతుంది. 38 నుంచి 40 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు చేరుకుంటే ప్రాణాంతకంగా మారుతుంది. అధిక ఉష్ణోగ్రతకు గురైన వ్యక్తి ఐదు రోజుల్లో మృతి చెందే ప్రమాదం ఉంటుంది. సాధారణంగా ఐదేళ్లలోపు, 60 ఏళ్ల పైబడ్డవారు త్వరగా వడదెబ్బకు గురవుతారు. గర్భిణుల శరీరంలో తేమశాతాన్ని కాపాడుకోకుంటే వడదెబ్బ తగులుతుంది. వడదెబ్బ ప్రభావం ముందుగా శరీరంపై పడుతుంది. రక్తకణాలు కుంచించుకుపోతాయి. అనంతరం ఈ ప్రభావం కిడ్నీలు, ఊపిరితిత్తులు, కాలేయం మీద పడుతుంది.



### వడదెబ్బ కొట్టే అవకాశం

ఎండల తీవ్రత ఇదే విధంగా ఉంటే ఉక్కపోతకు శరీరంపై చెమటపొక్కులు వచ్చే అవకాశం ఉంది. వీటిని గిల్లడం వల్ల ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. దాని వలన మండే ఎండలకు, దీనితో ఇంకా అసహనం ఫీల్ కావాల్సి ఉంటుంది. అదీగాక సూర్యుని కిరణాలు మధ్యాహ్నా సమయంలో చాలా శక్తివంతంగా ఉంటాయి. అందుకే ఆ టైమ్‌లో టోపీలు లేదా కర్చీఫ్‌లతో ఎండ తగలకుండా కాపాడుకోవాలి. లేకుంటే వడదెబ్బ తగిలి స్పృహ కోల్పోయే



ప్రమాదముంది. ప్రాణాపాయం జరిగే అవకాశం కూడా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతుంటారు. రాబోయే రోజుల్లో ఎండలు ఇంకా పెరిగే అవకాశం ఉందనీ, బయటకు ఎంత తక్కువగా వెళ్తే అంత మంచిదనీ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. పెరిగే వేడిమికి డీహైడ్రేషన్ కావడం, వాంతులు, విరేచనాలతో ఇబ్బందిపడి అస్వస్థతకు గురికావడం, శరీరం మీద చెమట కాయలతో బాధపడడం జరుగుతుంది కాబట్టి కొంచెం జాగ్రత్త వహించాలి.

### వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బకు గురైనవారి శరీరంలో నీటిశాతం లోపించి బాడీ డీహైడ్రేట్ అవుతుంది. శరీర ఉష్ణోగ్రత విపరీతంగా పెరుగుతుంది. దీని వల్ల గుండె, రక్తనాళాలు, కాలేయం, మూత్రపిండాలు దెబ్బతింటాయి. ఒంట్లోని లవణాలు చెమట రూపంలో బయటకు వెళ్లిపోవడంతో మనిషి నీరసించిపోతాడు. జ్వరం, తల తిరగడం, వాంతులు, విరేచనాలు, నీరసం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. అధిక ఉష్ణోగ్రత వల్ల పల్స్ పడిపోతుంది. అజీర్తి, తలనొప్పి వస్తాయి. మతి కోల్పోవడం, కోమాలోకి వెళ్లడం, మూత్రం పచ్చగా రావడం లాంటి లక్షణాలుంటాయి.

### చికిత్స

వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడలోకి తీసుకురావాలి. బట్టలను వదులు చేసి 25-30 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉన్న నీటితో శరీరాన్ని తడపాలి. దీని వల్ల శరీరంపై ఉండే రక్తనాళాలు కుంచించుకుపోకుండా ఉంటాయి. శరీర ఉష్ణోగ్రత తగ్గేలా చూడాలి. గజ్జలు, చంకలు, మెడపై ఐస్‌ప్యాక్‌లు పెట్టాలి. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి, సకాలంలో చికిత్స అందించాలి.

### చిన్నపాటి జాగ్రత్తలు అవసరం

వేసవి కాలంలో బయటకి వెళ్లేప్పుడు వాటర్ బాటిల్‌ను తీసుకెళ్లడం మర్చిపోవద్దు. అలాంటి సందర్భం ఎదురైన ప్పుడు చల్లటి ప్రదేశాలలో ఉండటానికి ప్రయత్నించండి. వేసవి కాలంలో ఆల్కహాల్, సిగరెట్, కెఫీన్ వంటి వాటికి దూరంగా ఉండండి. వాంతులు, అల సట, తలనొప్పి వంటివి రాకుండా చూసుకోవాలి. వేసవి కాలంలో మీ శరీర ఉష్ణోగ్రతలు పెరిగినట్లు గమనించినట్లయితే వెంటనే ఆరోగ్య నిపుణులను సందర్శించి సరైన

జాగ్రత్తలను తీసుకోవాలి. సూర్యరశ్మికి బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు తక్షణ శక్తినిచ్చే ద్రావణాలను అందుబాటులో ఉంచుకుని అవసరమైతే తాగటం చాలా మంచిది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉండే సమయంలో బయటకు రాకపోవడం ఉత్తమం. తరచూ నీళ్లు తాగాలి. తగినంత నీటి శాతం ఉన్నప్పుడే శరీర ఉష్ణోగ్రత అదుపులో ఉంటుంది. అందుకోసం వేసవిలో ప్రత్యేకంగా లభించే వివిధ రకాల ఆహార పదార్థాలు అధికంగా సేవించాలి. శరీర ఉష్ణోగ్రతను ఎల్లప్పుడూ అదుపులో ఉంచుకునే విధంగా ప్రయత్నించాలి. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే నీడలో ఉండేందుకు ప్రయత్నించాలి. రోజుకు రెండు సార్లు స్నానం చేయడం మంచిది. అలా చేయడం ద్వారా శరీర ఉష్ణోగ్రత అదుపులో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో మధ్యాహ్నం సమయంలో అధికంగా తినకపోవడం ఉత్తమం. ముఖ్యంగా ప్రొటీన్ ఫుడ్ మితంగా తీసుకోవాలి. తక్కువ మొత్తంలో ఎక్కువ సార్లు తినాలని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. చాయ్, కాఫీతో సహా ఇతర కూల్ డ్రింక్స్ ముఖ్యంగా ఆల్కహాల్ వంటివి ఎండాకాలంలో ఎక్కువగా తీసుకోకపోవడమే ఉత్తమం. ఈ సంవత్సరం ఎండాకాలం ప్రారంభం అయిన రోజు నుంచే ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. తెల్లవారిన కాసేపటికే సూర్యుడు భగ భగమంటూ వచ్చేస్తున్నాడు. ఉదయం ఏడున్నర, ఎనిమిది గంటల సమయం నుంచే వేడి వాతావరణం కనపడుతుంది. సుమారుగా 45 డిగ్రీల నుంచి 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. అంతేకాక వడగాలులు, ఈదురుగాలులు ఎక్కువగా వీస్తాయి. ఈ గాలులకు, ఎండవేడికి చిన్న పిల్లలు, ముసలివారు తట్టుకోలేరు. దీంతో వారికి ఎండదెబ్బ కూడా తాకే అవకాశం ఉంటుంది. ఈ వేసవి నుంచి ఉపశమనం పొందాలంటే తగిన జాగ్రత్తలు పాటించాలంటున్నారు వైద్యులు. లేదంటే అనేక సమస్యలు వెంటాడుతాయని హెచ్చరిస్తున్నారు. జాగ్రత్తలు పాటించకపోతే కొన్ని సమయాల్లో ఎండ వేడిమిని తట్టుకోలేక కొంత మంది ప్రాణాలను కూడా కోల్పోతుంటారు. మామూలుగానే ఎండా కాలంలో ఎండలు ఎక్కువే. ఇంకా పెరిగే ఈ ఎండలతో రానున్న ఎండాకాలం కొంచెం ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. అయితే కొన్ని చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే ఎండాకాలాన్ని కూడా హాయిగా ఎంజాయ్ చేయవచ్చు. అవేమిటంటే ఈ కాలంలో టైట్ జీన్స్ లాంటి దుస్తులు కాకుండా తెల్లని కాటన్ వస్త్రాలు ధరించడం ద్వారా శరీరానికి గాలి సోకుతుంది. కాటన్ వస్త్రాలు అయినప్పటికీ ఒంటికి అతుక్కుని పట్టేసే విధంగా కాకుండా పలచగా, వదులుగా ఉండేలా చూసుకోవడం ఎంతైనా అవసరం. దాని వలన చెమట పొక్కుల సమస్య ఉండదు. రోజూ రెండు సార్లు స్నానం చేయాలి. తోలుతో చేసిన చెప్పులు వేసుకోవాలి. బిర్యానీలు, మాంసాహారం, శరీరానికి వేడి చేసే మసాల దినుసులు, కారం ఎక్కువగా





ఉండే పచ్చళ్లు, వేపుడు పదార్థాలు తినకూడదు. నూనె తక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవడం మంచిది. అన్నం తిన్నాక చివరలో తప్పక మజ్జిగ అన్నం తినాలి. వేసవి కాలంలో సూర్యుడి వేడి తల, కళ్లకు తగలకుండా చూసుకోవడం చాలా అవసరం. కొబ్బరినీళ్లు, పండ్ల రసాలను ఎక్కువగా తీసుకోవాలి. వేపుడు పదార్థాలు, కాఫీ, ఫాస్ట్‌ఫుడ్, ఆల్కహాల్ తాగడం మానేయాలి, లేదా తగ్గించాలి. యోగా, నడకకు ప్రాధాన్యం ఇవ్వాలి. వదులుగా ఉండే కాటన్ దుస్తులనే ధరించాలి.

అధికంగా తీసుకోవాల్సినవి..

వేసవి కాలంలో తీసుకోవాల్సిన బెస్ట్ ఫుడ్స్‌లో మజ్జిగ ఒకటి. రోజులో తగినంత ఎక్కువ సార్లు మజ్జిగ తాగుతుండటం వల్ల శరీరానికి చల్లదనం అందుతుంది. అంతేకాదు, శరీరంలో బ్యాక్టీరియాను నాశనం చేసి, సాధారణ జలుబు, దగ్గును నివారించేందుకు మజ్జిగ దోహదం చేస్తుంది. పిల్లలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతారు. వేడిమికి డీహైడ్రేషన్, విరేచనాలు, చెమటకాయలతో బాధపడతారు. అయితే వేసవిలో దాహార్తిని తీర్చే చల్లటి నీరు, మజ్జిగతో పాటు ఎక్కువగా లభించే కొబ్బరి బొండాలను, తాటిముంజలను అధికంగా తీసుకుంటే వంటికి చాలా మంచిది.

### మార్పులు అనివార్యం

వాతావరణంలో మార్పులు మొదలవగానే మనలో చాలా మంది శరీరంలో కూడా కొన్ని మార్పులు కనిపిస్తాయి. ముఖ్యంగా ఎండాకాలం మొదలవగానే కొందరికి జలుబు మొదలవుతుంది. కొందరికి బాడీ అంతా రాషెస్

ఎండలు తీవ్రమయ్యేకొద్దీ రకరకాల అనారోగ్య సమస్యలు వస్తాయి. వేసవి నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో మండే వేడి మనల్ని పట్టి పీడించబోతోంది. కాబట్టి శారీరకంగా, మానసికంగా అనేక సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. ఎండాకాలంలో మొటిమలు, సూర్యరశ్మి వల్ల చర్మం రంగు మారడం వంటి చర్మ సమస్యలతో అందరూ బాధపడుతుంటారు. అందుకే వేసవిలో చర్మాన్ని మెయింటెయిన్ చేసేందుకు ఏం చేయాలి, ఏం నివారించాలి.. అనేవి తెలుసుకొని జాగ్రత్త పడడం ముఖ్యం. అలా అని ఏది బడితే అది దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఎండాకాలం వచ్చింది. రోజు రోజుకి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఎండవేడికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ ఎండాకాలంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. రోజంతా చర్మంపై తేమ ఉండేలా చూసుకోవాలి. ముఖంపై రోజ్‌వాటర్‌ను రాసుకుంటే మంచిది. కెమికల్ కలిపిన మందుల కంటే నాచురల్‌గా దొరికే వాటితో ముఖాన్ని శుభ్రం చేసుకుంటే మంచిది. చర్మం బాగా పొడిబారిపోయినప్పుడు సబ్బుతో ఎక్కువసార్లు కడుక్కోవద్దు. దీనికి బదులుగా వీలైనన్ని సార్లు చల్లటి నీటితో ముఖం కడుక్కుంటే తాజాగా ఉంటుంది. అన్నిటికంటే ముందుగా చేయాల్సింది ఏమిటంటే ఎక్కువ నీటిని తాగడం. సాధారణంగా మిగతా కాలాల్లో మీరు తీసుకుంటున్న నీటి కంటే రెండింతలు అధికంగా తీసుకోవాలి. అలాగే కీరదోస, క్యారట్, బీట్‌రూట్ లాంటి పచ్చికూరగాయలను కూడా తినవచ్చు. సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాల వల్ల చర్మంపై ముడతలు ఏర్పడతాయి. కనుక సాధ్యమైనంత వరకు ఎండ ఎక్కువగా ఉండే సమయాల్లో బయటకు వెళ్లకుండా ఉంటే మంచిది. తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని కొంచెం కొంచెంగా తీసుకోవాలి. విలువైన పోషకాలుండే పెచ్చకాయ, ద్రాక్ష, కర్బూజ లాంటి పండ్లరసాలను ఎక్కువగా తీసుకోవాలి. మధ్య మధ్యలో చల్లని మజ్జిగ, కొబ్బరినీరు తాగడం మరింత మంచిది. దీనివల్ల దేహంలోని వేడి తగ్గడంతో పాటు విలువైన పోషకాలు లభిస్తాయి. చర్మం తాజాగా ఉంటుంది. వేసవిలో ముఖంపై ఎక్కువగా జిడ్డు పేరుకుంటుంది. కనుక చల్లటి నీటితో కనీసం నాలుగైదు సార్లయినా కడుక్కోవాలి. ఎండలోంచి నీడకు వెళ్లిన వెంటనే కాకుండా కొంచెంసేపు ఆగి కడుక్కోవాలి. వీలయితే ఐస్‌తో ముఖంపై మర్దన చేసుకుంటే చర్మం మరింత తాజాదనం సంతరించుకుంటుంది. వేసవిలో రెండు పూటలా స్నానం



చేయడం మంచిది.

## ఎండాకాలంలో కారు ప్రమాదాలు


కారులో వెళ్తుంటే అకస్మాత్తుగా మంటలు చెలరేగడం వాహనదారులను ఆందోళనకు గురి చేస్తోంది. ఎండాకాలం మొదలైనప్పట్నుంచి కార్లలో సడన్‌గా మంటలు చెలరేగుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈ మధ్యనే వెళుతున్న కారులో మంటలు చెలరేగి ఒక కుటుంబం మొత్తం సజీవ దహనం అయిన సంఘటన మరువక ముందే మరొకసారి అలాగే మంటలు చెలరేగి ముగ్గురు చనిపోవడం.. ఇలాంటివి రోజుకి కొన్ని చూస్తూనే ఉన్నాం. అందుకే ఎండాకాలంలో కారు నిర్వహణలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. దీంతో కారు ఇంజన్ త్వరగా హీటెక్కుతుంది. ఈ నేపథ్యంలో మెయింటెనెన్స్ విషయంలో అశ్రద్ధ చూపొద్దు. చాలా మంది సరైన సర్వీసింగ్ చేయించకుండా నే లాంగ్ డ్రైవ్‌లకు వెళ్తుంటారు. కారు కొన్న సందర్భంలో ఉన్నవాటికి అదనపు ఫిట్టింగ్స్ చేయిస్తుంటారు. ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవటంలో నిర్లక్ష్యం చేస్తారు. కారులో వచ్చే నాణ్యమైన వైర్లను కట్ చేయడం, నాణ్యత లేని వేరే వైర్లను జత చేస్తుంటారు మెకానిక్‌లు. ఈ వైర్లు రాపిడికి గురవడంతో పాటు మండుతున్న ఎండలకు మంటలు చెలరేగే ప్రమాదముంది. సౌండ్ సిస్టం సరిగా అమర్చకపోవడం, అదనపు పవర్ కోసం బ్యాటరీకి నేరుగా వైర్లు కనెక్ట్ చేయడం కూడా ప్రమాదానికి కారణమవుతుంది. బ్యాటరీపై లోడ్ పెరిగి మంటలు చెలరేగుతాయి. ఎక్స్‌ట్రా ఫిట్టింగ్ కోసం పవర్ ఫూల్‌ను పెట్టడం, కూలెంట్ లెవల్స్‌ను సరిగా అడ్జెస్ట్ చేయకపోవటం, నాసిరరకం ఎలక్ట్రిక్ యాక్స సరీలు, ఎలక్ట్రికల్ వైరింగ్ స్టేషన్ ట్యాంపరింగ్ వల్ల కూడా షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉంటుంది.

## తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఎండాకాలంలో దూర ప్రాంతాలకు వెళ్లేప్పుడు మధ్య, మధ్యలో ఆగుతూ ఉండాలి. ఇంజన్ వేడి తగ్గిన తర్వాత మళ్లీ ప్రయాణం ప్రారంభించాలి. కార్లలో సిగరెట్ తాగకపోవడం మంచిది. వ్యాక్యుమ్ క్లీనర్లను వాడవద్దు. హెడ్ లైట్లు మార్చాలనుకుంటే బ్రాండెడ్ కంపెనీల లైట్లనే వాడాలి. మంటలు ఆర్పేందుకు కచ్చితంగా చిన్న సైజు పరికరాన్ని ఉంచాలి. ఐదు లీటర్ల వరకు నీళ్ల బాటిళ్లను కూడా అందుబాటులో ఉంచుకోవాలి. ఇంజన్ నుంచి పొగలు వస్తున్నట్లు అని పించగానే వెంటనే ఇంజన్ ఆపేసి వైరింగ్‌ను చెక్ చేయాలి. సెల్‌ఫోన్ల చార్జర్ల విషయంలోనూ జాగ్రత్తలు అవసరం. ఎక్కువ సాకెట్లున్న చార్జర్ల కారణంగా మంటలు వచ్చే ప్రమాదం ఉంది.

(మిగతా 19వ పేజీలో)





# నవ్వకుంటే జైలుశిక్షే

**సిహెచ్.వి.వి.రఘుబాబు**

ప్రపంచంలో వింతలు, విశేషాలకు కొదువే లేదు. ఈ ప్రపంచమే ఎన్నో విచిత్రాల సమాహారం. ఒక్కో దేశంలో ఒక్కో విధానం, నిబంధనలు అమల్లో ఉంటాయి. అందుకు అనుగుణంగా ఆయా దేశాల్లో వ్యవహరించాల్సి ఉంటుంది. లేకుంటే విపరీతమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అటువంటి విచిత్రమైన నిబంధనలు, విధానాలను గూర్చి ఇప్పుడు మనం తెలుసుకుందాం. ఈ మధ్య కాలంలో గుజరాత్‌కు చెందిన ఓ యువతి సోలోగమీ (స్వయం వివాహం) అంటే వరుడు లేని పెళ్లి... అంటూ కొత్త ఆచారాన్ని లేవనెత్తింది. దీన్ని విన్న పలువురు నోరెళ్లబెడుతుంటే, మరికొందరేమో ఇదెక్కడి పోయే కాలం అంటూ నానా మాటలు అంటున్నారు. ఇదే మాదిరిగా ప్రపంచ దేశాల్లో వివిధ వర్ణాలు, కులాలు, మతాలు ఉన్నట్టే వింత వింత చట్టాలు కూడా అమల్లో ఉన్నాయి. ఆయా చట్టాలను ఉల్లంఘించిన వారిని ప్రభుత్వాలు కఠినంగా శిక్షస్తాయి. ఇంగ్లండ్‌లోని మసాచుసెట్స్ లో ఓ వింత చట్టం అమల్లో ఉంది. అక్కడ ఎవరైనా స్నానం చేయ కుండా నిద్రపోతే చట్ట విరుద్ధంగా పరిగణిం చబడుతుంది. అంతేకాకుండా స్నానం చెయ్యకుండా నిద్రపోయినందుకు సైతం జైలు శిక్ష కూడా విధిస్తారు. అలాగే లో దుస్తులతో ఎవరైనా కారును శుభ్రం చేస్తే అందుకు గాను జరిమానా విధిస్తుంది అమెరికాలోని శాన్‌ప్రాన్సిస్కో. స్విట్జర్లాండ్‌లో ఎవరైనా రాత్రి 10 గంటల తర్వాత బాత్‌రూంలో ఫ్లష్ చేసినా లేదా బాత్ రూం నుండి ఏ విధమైన శబ్దం వచ్చినా జరిమానా విధిస్తారు. ఇటలీలోని మిలాన్‌లో బహిరంగంగా సంచరించే ప్రతీ పౌరుడూ ఎప్పుడూ నవ్వుతూ కనిపించాలి. ఎవరి ముఖం మీదనైనా నవ్వు మాయం అయ్యిందో దానిని తీవ్ర నేరంగా పరిగణించి 100 డాలర్ల వరకూ జరిమానా విధిస్తారు. దీంతో ఒక్క రోజుకు వందల మంది ఈ జరిమానాల బారిన పడుతు న్నారు. అయితే ఆసుపత్రి, అంత్యక్రియ లకు వెళ్లే సమయంలో మాత్రం మినహాయింపు ఉంటుంది. హాంకాంగ్‌లో భర్త తన భార్యను మోసం చేస్తే భార్య చేతులతో భర్తను చంపడం అక్కడ చట్టబద్ధంగా పరిగణించబడుతుంది. అయితే తన చేతులతో భర్తను చంపడం ఇష్టపడకపోతే ఇతర మార్గాల్లో ఈ శిక్షణలు అమలు చేసే వెసులుబాటు కూడా ఉంటుంది. సింగపూర్‌లో 1992 జనవరి 3వ తేదీ నుండి చూయింగ్ గమ్‌లను అమ్మడం, తయారు చేయడం నేరం. అయితే నోటి సంబంధిత వ్యాధులతో బాధపడే వారు డాక్టర్ సలహా మేరకు చూయింగ్ గమ్ నమలవచ్చని 2004లో అక్కడి ప్రభుత్వం మినహాయింపును ఇచ్చింది. సాధారణంగా ఏ దేశ ప్రభుత్వమైనా రోడ్లపై స్పీడ్‌గా డ్రైవ్ చేసే వారిని కఠినంగా శిక్షిస్తుంది. అయితే జర్మనీలోని ఆటోబాన్ రోడ్ల మీద మాత్రం కోరుకున్నంత స్పీడ్‌గా డ్రైవ్ చేయవచ్చు. కానీ కారులో సరిపడినంతగా ఆయిల్ ఉండాలి.ఒక వేళ రోడ్డుపై హఠాత్తుగా కారు ఆగిపోతే మాత్రం వెంటనే జరిమానా కట్టాల్సి ఉంటుంది. కాగా జపాన్‌లో ఊబకాయం క్షమించరాని నేరం. 2008 సంవత్సరంలో మెటాబోలాను జపాన్ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. పావురాలకు ఆహారం ఇస్తే శాన్‌ప్రాన్సిస్కో, ఇటలీలలో నేరంగా పరిగణించబడుతుంది. ఎవరైనా పావురాళ్లకు గింజలు వేస్తూ కనిపిస్తే వెంటనే అరెస్ట్ చేస్తారు.

## 12 ఏళ్లుగా ఒక్క అబ్బాయి కూడా పుట్టలేదు

వెతకాలే కాని ప్రపంచ వ్యాప్తంగా అనేక అద్భుతాలు, అంతుచిక్కని రహస్యాలు నిండి ఉన్నాయి. అందులో ముఖ్యమైనది మనం జీవిస్తున్న ఈ భూమే ఓ పెద్ద అద్భుతం. దీని ఆవిర్భాం నుండి జీవరాశుల పుట్టుక వరకూ ప్రతీ ఒక్కటీ అద్భుతమే. అయితే తలపండిన మేధావులకు సైతం అందని ఎన్నో రహస్యాలు ఈ భూమి మీద ఉన్నాయి. అవి ఇప్పటికీ మిస్టరీగానే



మిగిలిపోయాయి. అలాంటి కోవకే వస్తుంది పోలాండ్ దేశంలోని ఓ చిన్న కుగ్రామం. ఈ గ్రామాన్ని అంతుచిక్కని ఓ మిస్టరీ వెంటాడుతోంది. పోలాండ్‌లోని ఓ పల్లెటూరు సైన్స్‌కే సవాల్ విసురుతోంది. ఆ ఊర్లో అసలు మగ పిల్లలు పుట్టరు. ఎవరైనా మహిళ గర్భం దాల్చితే వారి కడుపులో ఆడపిల్లలు మాత్రమే పుడతారు. ఒకటి కాదు. రెండు కాదు గత 20 ఏళ్లగా ఆ గ్రామంలో ఒక్క మగపిల్లవాడు కూడా పుట్ట లేదు. కానీ ఇది పూర్తిగా నిజం.

శాస్త్రవేత్తలు కూడా ఈ మిస్టరీని చేధించ లేకపోయారు. దీంతో ఆ ఊరి మేయర్ ఓ కీలక ప్రకటన చేశారు. ఎవరైనా మగ సంతానం కలిగితే భారీ పారితోషికం ఇస్తామని ప్రకటించారు. కానీ ఒక్కరికీ కూడా మగ సంతానం కలుగకపోవడంతో ఒక్కరూ కూడా ఈ రివార్డును తీసుకోలేక పోయారు. అప్పటి నుండి ఇప్పటి వరకూ ఎవరికీ మగ పిల్లలు పుట్ట లేదు. వైద్యులు, శాస్త్రవేత్తలు సైతం ఈ గ్రామంపై దృష్టి సారించి, రకరకాల పరీక్షలు నిర్వహించినా అందుకు గల కారణాలు మాత్రం తెలుసుకోలేకపోయారు. దీంతో ఈ గ్రామంలో మగ పిల్లలు ఎందుకు పుట్టడం లేదన్నది అంతుచిక్కని మిస్టరీగానే మిగిలిపోయింది. అయితే కొందరు శాస్త్రవేత్తలు మాత్రం త్వరలోనే ఈ మిస్టరీని చేదిస్తామని చెబుతున్నారు.

## ప్రపంచంలో మాట్లాడలేని, వినలేని గ్రామం ఇదే ..

ప్రకృతి అనేక రహస్యాలకు నెలవు. ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వింత సంఘటనలు జరుగుతూ సైన్స్‌కు సవాల్ విసుతూనే ఉన్నాయి. కొన్ని గ్రామాలు అందాలకు నెలవు అయితే మరికొన్ని వింత వింత ఘటనలతో ప్రపంచ వాసుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ప్రపంచంలో అనేక ప్రాంత వాసులు కూడా మూఢ నమ్మకాలను విశ్వసిస్తారు. తమకు శాపం ఉందని, అందుకనే తమ గ్రామస్తులు మూగ, చెముడు వారీగా మారుతున్నారని ప్రగాఢనమ్మకంతో అక్కడి వారు ఉన్నారు. ఇండోనేషియాలోని బెంగాలా గ్రామంలో నివసించే ప్రతీ వ్యక్తి సంజ్ఞలలో మాత్రమే మాట్లాడతారు. ఎందుకంటే ఈ గ్రామంలోని కుటుంబాల లోని వ్యక్తులు మాట్లాడ లేరు, వినలేరు. అటువంటి పరిస్థితుల్లో ప్రజలు సంజ్ఞలలో మాట్లాడటం నేర్చుకుంటారు. దీంతో ఈ గ్రామం చెవిటి గ్రామంగా గుర్తింపు తెచ్చుకుంది. ప్రపంచంలో మాట్లాడలేని, వినలేని గ్రామం ఇదే. ఇక్కడ నివసించే



వ్యక్తులు కట కోలోక్ అనే ఒక భాషను మాత్రమే ఉపయోగిస్తారు. ఈ సంకేత భాష వందల ఏళ్ల నాటిది. ఈ వందల సంవత్సరాల నాటి భాష ఆ గ్రామంలోని ప్రజలకు మాత్రమే అర్థం అవుతుంది. ఈ ఊరిలో పుట్టిన పిల్లల్లో వినికిడి లోపంతో పాటు, మూగవారు. దీంతో తమ భావాలను ఇతరులకు వ్యక్తం చేయడానికి సైగలతోనే వ్యవహరిస్తారు. ఈ సైగల భాష ఊరి ప్రజలకు మాత్రమే కాదు ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం వాడుకలో ఉంది. ఈ గ్రామం జనాభా సుమారు 3 వేల మంది. శాస్త్రవేత్తలు చెబుతున్న ప్రకారం ఈ ప్రాంతంలో డిఎఫ్ఎన్‌బి3 అనే జన్యువు ఉనికి ఉంది. ఇక్కడ పుట్టిన వారిలో ఈ జన్యువు ఏడు తరాలుగా కొనసాగుతోంది. ఈ కారణంగా ఇక్కడి ప్రజలు చెవిటివారుగా జన్మిస్తారు అని నిర్ధారించారు. కాగా ఈ గ్రామంలో నివసించే ప్రజలు శాపం కారణంగానే తమకు ఈ పరిస్థితి ఏర్పడిందని భావిస్తారు. ఆ గ్రామస్తుల కథనం ప్రకారం చాలా సంవత్సరాల క్రితం మాయమాటలు చెప్పే ఇద్దరు మాంత్రికులు ఈ గ్రామంలో ఉండేవారు. అయితే ఈ ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అది చిలికిచిలికి గాలివానగా మారి ఇద్దరి మధ్య పెద్ద ఘర్షణ జరిగింది. ఈ సమయంలో వారు ఒకరినొకరు చెవిటి వారిగా మారమని శపించుకున్నారు. దీంతో ఏడు తరాల నుండి ఇప్పటి వరకూ ఈ శాపం కొనసాగుతూ తమ గ్రామస్తులు పుట్టిన తర్వాత మూగ, చెవిటి వారుగా మారుతున్నారని చెబుతున్నారు.

## ఈ గ్రామస్తులు నెలల తరబడి నిద్రపోతారు

ప్రకృతి సృష్టించిన ఈ ప్రపంచంలోని విచిత్రమైన సంఘటనలు తెలిస్తే ఇది నిజమేనా అనే అనుమానాలు తలెత్తుతాయి. అంతేకాదు కొన్ని గ్రామాల్లో చోటు చేసుకునే వింతలను నేటికీ మనిషి మేధస్సు ఛేదించలేదని తెలిస్తే షాక్ తింటాం. అటువంటి గ్రామమే మనం తెలుసుకో బోయేది. ఎవరైనా ఎక్కువ సమయంలో నిద్ర



పోతుంటే వీడు కుంభ కర్ణుడి తమ్ముడిలా ఉన్నాడు అంటూ కామెంట్లు చేయడం సర్వసాధారణం. ఇక్కడి ప్రజలు ఎప్పుడైనా, ఎక్కడైనా నిద్రలో వాలిపోతారు. ఈ గ్రామం కజకిస్తాన్‌లో ఉంది. కలాచి గ్రామంలోని ప్రజలు సుదీర్ఘంగా నిద్రపోతుంటారు. అందుకనే ఈ గ్రామాన్ని స్లీపీ హాలో అని కూడా పిలుస్తారు. ఈ విచిత్రమైన గ్రామంలో దాదాపు 600 మంది నివసిస్తున్నారు. వీరంతా నెలల తరబడి నిద్రపోతారు. అంతకన్నా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే నెలల తరబడి నిద్రపోయిన తర్వాత లేస్తే గతంలో జరిగినదంతా గ్రామస్థులు మరచిపోతారు. బజారులోనే, స్కూల్లోనో, రోడ్డు మీదనో ఎక్కడైనా పడుకోవడం మొదలుపెడతారు. అలా రోజులు, నెలల తరబడి నిద్రపోతూనే ఉంటారు. ప్రపంచం నలు మూలల నుండి చాలా మంది శాస్త్రవేత్తలు ఈ గ్రామానికి సంబంధించిన ఈ మిస్టరీని ఛేదించడానికి ప్రయత్నించినప్పటికీ ఇంత వరకూ ఎవరూ కనుగొనలేకపోయారు. కజకిస్తాన్‌లోని ఈ గ్రామానికి సమీపంలో ఒక యురేనియం గని ఉండేదని, అది ఇప్పుడు మూసివేసినట్లు అంటారు. ఈ గని నుండి విషపు రేడియేషన్ వచ్చేదని, దీని కారణంగా ఈ గ్రామస్తులు ఇలాంటి వింత వ్యాధి బారిన పడ్డారని కొంత మంది వాదిస్తుంటారు.

అయితే ఇప్పుడు ఈ గ్రామంలో ఇంకా చెప్పుకోదగ్గ స్థాయిలో రేడియేషన్ లేదు. అయినప్పటికీ ఈ వ్యాధికి కారణం యూరేనియం గనులు కాదని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ఈ నిద్ర రుగ్మతకు కారణం ఇక్కడ నీటిలోని కార్బన్ మోనాక్సైడ్ వాయువని అంటున్నారు. అందుకే ఇక్కడ ప్రజలు నెలల తరబడి నిద్రపోతారని పేర్కొంటు న్నారు. కానీ శాస్త్రీయ కారణాలు మాత్రం సరైనవి చూపించడం లేదు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఈ గ్రామం ఇప్పటికీ ఒక మిస్టరీగానే మిగిలిపోయింది. ❑

పాలగోకురు లాంటి నీ కళ్లలో/ పాలపుంతలున్నాయేమో
నీ ఓరచూపుల వెలుతురు అరల్లోనే
నా విశ్వం ఎప్పటికీ నిలిచి ఉంటుంది.
నీ చిరు చిరు నవ్వుల్లో/ తారా తోరణాలున్నాయేమో
నీ పలువరుస నీహారిక పూతల్లోనే
నా ఆకాశం పూలవనం అవుతుంది.



# ప్రేమమెట్ల పియానో

నీ శిరోజాల పాయల్లో
పట్టుమబ్బులు చిక్కుబడ్డాయేమో
నానిన ఒంట్రు మీద పూస యిసుక మెరుపులా జారే
నునుమెత్తని మెట్ల పియానో స్పర్శకందుతుంది.
వేణువుల్లాంటి నీ చేతుల్లో/ వెన్నెల మొగ్గల స్వరాలున్నాయేమో
నీ వేళ్లు జొనపగానే
నా జుట్టునిండా జాబిలిపిందెలు వేలాడతాయి.
అంతరిక్షం లాంటి నీ దేహంలో/
అరోరా వర్ణాలన్నీ నిద్రిస్తున్నాయేమో
నీ కళ్లముందరకొస్తే/ ఆ కిరణ కాంతులు నన్నూ జోకొడతాయి.
నాలో ఎప్పుడు మొదలయ్యిందో/ ఈ బిగ్ బ్యాంగ్
ఆ క్షణం నుండీ/ నువ్వూ నేనూ ఒక్కరం!
ఒకే నువ్వు ఒకే నేనుగా ఒకే స్వప్నం
మన ఊహలన్నీ ఇక మన చెంత!
నీ చిటికెన వేలు అందుకున్న తరువాత
నా డోర్బ్రమ్స్ లోలకానికి నిశ్చింత!
ఎన్ని కాంతి సంవత్సరాలు దూరమయినా పర్లేదు
కలిసి ఈదేద్దాం పద కన్నా!/ ఈ ప్రేమమయ ప్రపంచాన్ని!

**- కంచరాన భుజంగరావు**

---

# ఒక నిర్వేదం



రాతిరి నీ తలపులతో
ఘూర్నిల్లుతున్న/ క్షణాల గొలుసు
చివర్లను
ఉదయపు సూర్యకిరణాల
నీ మేల్కొల్పులతో ముడేస్తూ
ఏ ఒక్క ఘడియనూ
నీ నుండి తెంచుకోలేకపోతున్నా.
మంత్రిస్తున్న నీ మాటల సాక్షిగా
లక్షల చందమామలు
చెంత చేరి జోలపాడుతున్నాయి.
నవ్వుకోవటం నా వంతైనా
వింతలు పోగుచేసి
నాపై అమాంతం కుమ్మరించటం
నీకు కాక ఎవ్వరికీ సాధ్యం కాదేమో..
ఎక్కడో చిక్కుముళ్ల మధ్య/ తెగిపోయిన
మల్లెతీగ/ మళ్లీ ప్రేమ పందిరిని
గాఢంగా అల్లుకుంటుంది.
ఎన్నో గుబాళింపులు/ మిళితమై
మనసును/ ఊయలలూపటం ఓ
మధురమైన కావ్య ఝరీ..
ఏ భాషకూ చాతకాని వర్ణన
మరోలా చెప్పాలంటే..
అనిర్వచనీయ హృదయ శ్వాస ఇది.
ప్రాణమున్నంత కాలం
నీ కోసం కొన్ని అక్షరాలను
ఇలా ప్రోది చేస్తూనే ఉంటా..
ఈ గుప్పెడు గుండెను/ చెమ్మగిల్లే కళ్లతో
చేది/ నీ ఒడిలో పెడతాను./ నన్ను
నమ్ముతున్నావు కదూ..

**- డా॥ కటుకోర్ముల రమేష్**

## ఈ వారం కవిత్వం



# ఆదర్శం

అడుగులకు మడుగులు ఒత్తేవారు
వారి ఉన్నతి కోసం
తాపత్రయపడతారు.
మన అడుగులను
ఆదర్శంగా తీసుకునేవారు
మనల్ని చరిత్రలో నిలబెడతారు
మనల్ని అనుకరించేవారు కాదు.
అనుసరించేవారిని
సంపాదించుకుందాం
అందరికీ ఆదర్శంగా వుందాం.

**- నేదునూరి కనకయ్య**



## ఆణిముత్యాలు..సోమేపల్లి నానీలు

ప్రతిభావంతుడైన కవి సోమేపల్లి వెంకట సుబ్బయ్య 'నానీ' ప్రక్రియలో వెలువరించిన అయిదవ కవిత్వ పొత్తం 'నాగలికి నా నమస్కారం' 'భూమికి వంగిన/ హరివిల్లు కాదు/ నాట్లు వేసే కూలితల్లి' వంటి మట్టి పరిమళాలను గుబాళించిన పద్యాలతో బాటు అనేక సామాజిక అంశాలను నానీకరించారు కవి సోమేపల్లి. 'ఆకలి డొక్కకి/ ముద్దకరువు/ విలాసాల విస్తరికి/ దుబారా దరువు' ఆకలిని, ఆజీర్తిని దృశ్యమానం చేస్తు పాణి గీసిన చిత్రం ఈ నానీని ప్రకాశవంతం చేసింది. 'నల్లని నేలపై/రంగుల చీర/ రాలిన పూలే/ కొత్త డిజైన్లు' సోమేపల్లి గొప్ప భావుకుడు. అక్షర నియతి పాటిస్తూ నాలుగు పాదాల్లో కవిత్వం పండించడంలో సిద్ధహస్తుడు. 'అక్షరం కన్నా/ ఆకలిదే ఆకర్షణ/ బుడి బుడతల/ మధ్యాహ్న భోజనం' నానీ నిర్మాణంలో చివరి రెండు పాదాల్లో పలికించే 'చరువు' (Punch) ఆ లఘు కవితకు ఆయువు పట్టులాంటిది. ఆ ఒడుపు తెలిసిన కవి వెంకట సుబ్బయ్య. అందుకే ఆణిముత్యాల్లాంటి నానీలు ఆ కలం నుండి రాలినై'. వాళ్లిద్దరూ జీవిత ఖైదీలే/ సంసారమనే సాగరంలో..'వంటి తాత్వికత తొణిక సలాడిన జీవన సందర్భాలు చాలానే వున్నాయి. నానీ ప్రక్రియలో యిన్ని గ్రంధాలు రాసిన కవి బహుశః సోమేపల్లి వారేనేమో! చూద్దాం! మున్ముందు యింకెన్ని వెలువరిస్తారో!!

**(నాగలికి నా నమస్కారం, సోమేపల్లి వెంకటసుబ్బయ్య, వెల: రూ 60, ఇ.నం.16-8-451, మొదటి అంతస్తు, శ్రీనివాసనిలయం, విజయపురి కాలనీ, జె.కె.సి. కాలేజీ రోడ్డు, గుంటూరు)**

**- రమణ వెలమకన్ని**

## 'చైతన్య రథచక్రాలు'




ఈ వ్యాసాలన్నీ వివిధ పత్రికల్లో ప్రచురణై ప్రజా దరణ పొందినవే. వీరు గతంలో చైతన్య కెరటాలు, చైతన్యకిరణాలు, చైతన్య తరంగాలు, చైతన్యశిఖరాల పేర్లతో పుస్త కాల ప్రచురించారు. నక్సలైట్ ఉద్యమ సానుభూతిపరునిగా సచి వాలయంలో ఉద్యోగం చేస్తారు. ఎమర్జెన్సీ కాలంలో జైలుజీవితం, నిర్బంధం గడిపిన జయరాముడు వ్యాసాలు వారిపక్ష ఉద్యమానికి ఆయాసంఘటనలకు అద్దంపడతాయి. ఉద్యోగక్రాంతి పత్రికను స్థాపించిన వాళ్లలో వీరూ ఒకరు. వామపక్షవాదులకు ఇతర ప్రజా సామాజిక రంగ కార్యకర్తలకు వీరి వ్యాసాలు ఆలోచింప జేస్తాయి. కార్యాచరణకు మార్గదర్శకాలుగా ఉంటాయి. అదనపు విలువ అంటే ఏమిటి? రాజ్యం పుట్టుక రాజ్యహింస, ప్రతిఘటన ప్రజాస్వామ్యం లేని భారతదేశం, పాతపెన్షన్ స్కీమ్‌లో ప్రయోజనాలు ఎక్కువ రెండు తరాలపాపం-వ్యాసం కుంభకోణం! ఆలోచింప జేసేవే. ప్రముఖ దినపత్రికల్లో ఇతర సామాజికవేత్తలు, పత్రికా రచనలు రాసిన ప్రజోపకర వ్యాసాలూ యీ పుస్తకంలో ప్రచురించడం బాగుంది. ప్రభుత్వఖజానాకు గండిపెట్టిన పాలకులు (పే.219) పథకాలు సరే, పాలకులదే దగాదేశంలో విదేశీవిరాళాల ప్రభావం. మహిళాబిల్లుతోపాటు బిసి రిజర్వేషన్లు! (పేజ.250). వ్యాసాల్లోని విశ్లేషణ, వివరణ, చరిత్ర అధ్యయనవాదులకు, విద్యార్థులకు రాజకీయకార్యకర్తలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి.

**(చైతన్య రథచక్రాలు (66 వ్యాసాల సంకలనం), రచన: వి.జయరాముడు, వెల: రూ 200, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్)**

**- తంగిరాల చక్రవర్తి**

# పుస్తక సమీక్ష

## పున్న అంజయ్య వ్యాసావళి



కవిగా, కథా, నవలా రచయితగా, పత్రికా సంపాదకునిగా వ్యాస కర్తగా, సాహితీ మేఖల సంస్థకు ప్రధాన కార్యదర్శిగా దశాబ్దాల తరబడి సేవలు అందిస్తున్న పున్న అంజయ్య 41 వ్యాసాల సంపుటి ప్రచురింపచేసారు. గత కాలపు సాహితీ సాంస్కృతిక వైభవాన్ని ఈతరం పాఠకులకు అందించడానికి అంజయ్య అభినందనీయమైన కృషి చేసారు. శ్రీశ్రీ, చలం, సినారె, కాళోజీ వంటి లబ్ధప్రతిష్ఠుల గురించిన వ్యాసాలతోపాటు నల్లగొండ జిల్లా శతక కవుల పరిశీలన, తెలంగాణ పునరుజ్జీవనానికి, నాలుగు భాషా సేవకు, పత్రికారంగానికి చెందిన ప్రాతఃస్మరణీయుల చరిత్ర వ్యాసాలలో వివరించారు. అభ్యుదయకవి కాంచనపల్లి, ఆర్ద్రకవి పులిజాల, కవి సింహం ధవళా, అజ్ఞాతకవి సిరిప్రెగడ, సాహితీ తపస్వి అంబటి పూడి, మధురకవి మద్దోజు, తెలంగాణ వైతాళికుడు డా॥దేవులపల్లి, ప్రజాకవి సుద్దాల హన్మంతు, విద్యావేత్త చినవెంకట్ రెడ్డి, వాస్తుశిల్పి డా॥బి.ఎన్.రెడ్డి ఎందరో ప్రతిభావంతుల జీవిత విశేషాలను ఈ సంపుటిలో వెలుగు చూసాయి. 1913 వరకు అసలు పత్రికల ఊసేలేని తెలంగాణలో నీలగిరి, తెనుగు, గోలకొండ వంటి పత్రికలతో సంఘసంస్కరణ, భాషోద్యమం, పునరుజ్జీవనానికి అంకితమైన సురవరం, షబ్నవీసు, బూర్గుల, మాడపాటి, పులిజాల, శేషాద్రి రమణ కవుల, సాహితీ మేఖల సంస్థ ప్రాదుర్భావల ఈ వ్యాసావళి, తెలంగాణ అస్తిత్వ ఔన్నత్యానికి అద్దం పట్టోంది.

**(వ్యాసావళి, రచన: పున్న అంజయ్య, వెల: రూ150, ప్రతులకు: 6-2-954/2, మీర్‌బాగ్‌కాలనీ, నల్లగొండ)** – యర్రమిల్లి

## పాఠకులను ఆలోచింపచేసే కథలు



50 ఏళ్లుగా ఒక సంస్థ నిలిచి ఉండి పలు ప్రజోపయోగమైన ప్రశంసనీయమైన కార్యక్రమాలు చేస్తూ ఉండటం అభినందనీయం. డా॥వంశీరామరాజు 1972లో స్థాపించిన 'వంశీ ఆర్ట్ థియేటర్స్' సంస్థ స్వర్ణోత్సవాల సందర్భంగా ఇప్పటివరకు 11 విజ్ఞాన దాయకమైన పుస్తకాలను ప్రచురించారు. ఇది వారి 12వ ప్రచురణ. 66 మంది రచయితల కథాసంకలనం యిది. నటుడు నాటక రచయిత, కథకుడు నవలాకారులైన స్వర్గీయ గొల్లపూడి మారుతీరావు స్మరణలో సంకలనకర్తలు డా॥తెనేటి సుధాదేవి, జ్యోతివలబోజు పాఠకులకు అందిస్తోన్న అపురూప కానుక ఇది. యండమూరి వీరేంద్రనాథ్, ప్రొ॥రామాచంద్ర మౌళి, సింహప్రసాద్‌సలీం, డి.కామేశ్వరి, పోల్కంపల్లి ముక్తేవి భారతి, వంగూరి చిట్టెన్‌రాజు, భువనచంద్ర జలంధర ఎమ్మెస్వీరంగ రాజు లాంటి లబ్ధప్రతిష్ఠుల కథలు, కవితాబేతి, మస్తోవంశీ శ్రీసేరి, కవితారాంలాంటి వర్ధమాన రచయిత/ రచయిత్రుల వచనలున్నాయి. యండమూరి 'భవిష్యత్తులో ఒకరోజు'లో ఏం జరుగుతున్నదో కాకుండా రేపు ఎలాంటి పరిణామాలు చోటు చేసుకోనున్నవో వివరించారు. ఒకప్పుడు భయభక్తులతో ఇంటిపని చూసే పనిమనుషులు ఎలా మారిపోతున్నారో 'ఇది ఇలాగే'లో రచయిత్రి షామీర్ జానకీదేవి చెబుతారు. చోటు చేసుకోబోయే పరిణామాలకు విస్తుపోయేలా చేస్తాయి. సంకలనకర్తలకు అభినందనలు.

**(కొత్తకథలు-5, సంకలనం, తెన్నేటి సుధాదేవి, జ్యోతివలబోజు, వెల: రూ 400, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్)** **- కూర చిదంబరం**

# తీరు తెలిస్తే చాలు..

ఒక పెద్దాయన కూర్చున్నారు.
ఆయన చుట్టూ కొందరు మిత్రులు గుమికూడారు.
ఏదో ఒక ముఖ్యమైన విషయాన్ని ఆయన వారికి చెప్తున్నారు.
మిత్రులందరూ ఎంతో ఆసక్తితో వింటున్నారు.
ఇంతలో అక్కడికి ఓ వ్యక్తి పరిగెత్తుకుంటూ వచ్చాడు.
ఆయన వచ్చిన వేగం చూడటానికి ఎలా ఉందంటే "నాకు ఏదన్నా సాయం చేయండి లేదా అంతే మీ సంగతి" అని చెప్తున్నట్టుగా ఉంది.
అతని స్వరం బెదిరిస్తున్నట్టుగా ఉంది. గదమాయిస్తున్నట్టుగా ఉంది.
అతని మాట వినడంతోనే పెద్దాయన ఏమాత్రం ఆవేశపడలేదు. ఆందోళన చెందలేదు. కానీ అతని చుట్టూ ఉన్నవారు ఆవేశపడ్డారు. కంగారు పడ్డారు.
ఆ విషయాన్ని పెద్దాయన గమనించారు.
"కాస్తంత శాంతించండి.. ఎందుకు ఆవేశపడటం.."
పరిగెత్తుకుంటూ వచ్చిన వ్యక్తిని దగ్గరకు పిలిచి అతనికి కొన్ని వస్తువులు ఇచ్చారు.
"ఇప్పుడు మీకు సంతోషమేనా?" అని అడిగారు పెద్దాయన.
"అవును.. ఆనందమే!" అని నిర్లక్ష్యంగా చెప్పాడా వ్యక్తి.
"నేను మీతో సక్రమంగానే ప్రవర్తించేనా?" అని అడిగారు పెద్దాయన.
"అదేంలేదులెండి" అని ఆ వ్యక్తి మరింత నిర్లక్ష్యంగా చెప్పాడు.
అతని వాలకం చూసి పెద్దాయన చుట్టూ కూర్చున్నవారికి కోపం రెట్టింపైంది. ఆ నిర్లక్ష వ్యక్తిని సమీపించారు. అతనిని కొట్టాలనుకున్నారు.



అయితే పెద్దాయన వారిని అడ్డుకున్నారు.
ఆ నిర్లక్ష్య వ్యక్తిని తనతో రమ్మనమని భుజం మీద చేయి వేసి తీసుకుపోయారు పెద్దాయన.
ఇద్దరూ ఇంటికి చేరుకున్నారు.
అక్కడికి వెళ్లడంతోనే పెద్దాయన మరిన్ని వస్తువులు ఇచ్చారు.
"ఇప్పుడు తృప్తేనా.. నేను మీతో సక్రమంగానే నడచుకున్నానా?" అని అడిగారు పెద్దాయన.
ఆ మాటలతో ఆ నిర్లక్ష్య వ్యక్తి ముఖం విప్పారింది. "మీకు కృతజ్ఞతలు. భగవంతుడు మీ కుటుంబానికి తప్పకుండా మంచి చేస్తాడు" అని అన్నాడా వ్యక్తి.
"నాకు చెప్పిన ఈ మాటనే మీరు నా మిత్రులతోనూ చెప్తే వారి కోపం చల్లారుతుంది. నాతో రాగలరా?" అని అడిగారు పెద్దాయన.
"తప్పక వస్తాను. దానికేముంది. ఇప్పుడు కాదుగానీ రేపు ఉదయం మీ దగ్గరకు వస్తాను. మనమిద్దరం కలిసి మీ మిత్రులను కలుద్దాం" అన్నాడా వ్యక్తి.
కాస్సేపటికి ఆ పెద్దాయన మిత్రులను కలిసి జరిగిన విషయమంతా చెప్పాడు. ఇంతకూ ఆ పెద్దాయన ఎవరో కాదు, ఓ మత పెద్ద.
ఓ మనిషి ఎంతో ఆశతో ఓ ఒంటెను పెంచసాగాడు. ఒరోజు ఆ ఒంటె కర్రకు కట్టేసి ఉన్న తాడును తెంపుకుని పరుగులు తీసింది.
ఈ విషయం తెలిసిన ఇరుగు పొరుగువారు ఆ ఒంటెను పట్టుకురావడానికి ప్రయత్నించారు. దాని వెంట పడ్డారు.
ఒంటె అడ్డదిడ్డంగా పరుగెత్తసాగింది.
ఇంతలో అక్కడికి ఒంటె యజమాని వచ్చాడు.
"మీరేమీ చేయకండి. దాని స్వభావం నాకు బాగా తెలుసు. దానిని నేను చాలా సులభంగా నా దారిలోకి తెచ్చుకొంటాను. దాని సంగతి నేను చూసుకుంటాను. మీరు వెనక్కు వెళ్లిపొండి" అన్నాడు ఒంటె యజమాని.
"సరేనని" అందరూ వెనక్కు వెళ్లిపోయారు.
ఇంతకూ ఆ యజమాని ఏం చేసాడంటే..
కాస్తంత గడ్డిని తీసుకుని ఒంటె దిశలో అడుగులు వేశాడు.
అంతే, అమాంతం అది పరిగెత్తుకు వచ్చింది. యజమాని దగ్గరకొచ్చి కూర్చుంది. దాని వీపు మీద ఆ యజమాని తన వేళ్లతో మృదువుగా రాశాడు. దాని వీపు మీద కూర్చున్నాడు యజమాని.
ఈ విషయాన్నే ఆ మతపెద్ద తన మిత్రులకు చెప్పాడు.
"ఒంటెనే కాదు, కొందరు మనుషుల పట్ల సైతం ఆవేశపడకుండా ప్రవర్తిస్తేనే వారిని దారిలోకి తెచ్చుకోగలం. అంతేతప్ప వారిలా రెచ్చిపోతే ఇద్దరి మధ్య సాన్నిహిత్యం చోటుచేసుకోకుండా గొడవ మరింత పెద్దదవుతుంది. ఇందువల్ల మనసు నలిగిపోవడం తప్ప మరేమీ ఉండదు".
నిజంగా ఇదొక మంచి సూచన.

...

ఓ కుటుంబ యజమాని ఉదయం లేచినప్పటి నుంచీ అరుపులు మొదలుపెట్టాడు. చిందులు తొక్కుతున్నాడు. ఆ అరుపులు విని ఇరుగు పొరుగువారు వచ్చి అతనికి సర్దిచెప్పడానికి ప్రయత్నించారు. కానీ లాభం లేకపోయింది. చివరికి అతని భార్య వచ్చింది.
"మీరందరూ వెళ్లిపొండి. ఆయన సంగతి నేను చూసుకుంటాను. ఆయన తీరు నాకు తెలుసు" అంది.
ఆ మాటతో ఇరుగు పొరుగువారు వెళ్లిపోయారు.
సాయంత్రం వారంతా వచ్చి ఆయన్ని చూసారు.
ఆయన ప్రశాంతంగా కూర్చున్నారు ఓ మూల.
అందరికీ ఆశ్చర్యం వేసింది.
"ఆయన్ని శాంతపరచడానికి మీరు ఏం చేసారమ్మా?" అని అడిగారు ఆ ఇంటి ఇల్లాలిని.
"ఏమీ లేదు. ఓ పూట అన్నం పెట్టకుండా పస్తు ఉంచానంతే" అని చెప్పిందా గృహిణి.

**- యామిజాల జగదీశ్**

# మార్కెట్లో కొత్తగా..



## మడత పెట్టుకునే వాషింగ్ మెషిన్




బట్టలను ఉతికిన తరువాత మడత పెట్టుకోవడం సహజం. కానీ వాషింగ్ మెషిన్‌ను మడత పెట్టుకోవడం ఏమిటి? నిజమే. ఇందులో బట్టలు ఉతకడం అయిపోయిన తరువాత దీనిని ఎంచక్కా మడత పెట్టుకోవచ్చు. ఎక్కడికైనా తీసుకెళ్లవచ్చు. దూర ప్రయాణాల్లో తీసుకెళ్లేందుకు ఇది చాలా అనువుగా ఉంటుంది. దీనిని పూర్తిగా తెరిచాక బకెట్ సైజులో ఉంటుంది. మడత పెడితే టిఫిన్ డబ్బా సైజుకు మారుతుంది. ఈ మెషిన్ ద్వారా కరెంట్ బిల్, నీటి వాడకం కూడా తగ్గుతాయి. కాయ్ జియా అనే చైనీస్ డిజైనర్ మడత పెట్టుకునే ఈ మెషిన్‌కు రూపకల్పన చేశారు. త్వరలో ఈ మెషిన్ మార్కెట్‌లోకి విడుదల కానుంది.

## క్షణాల్లోనే శుభ్రం



ఆహార పదార్థాలను శుభ్రం చేయడానికి వాటిని నీళ్లలో కడుగుతాం. అయినా వాటిపై బ్యాక్టీరియా, వైరస్ లాంటి సూక్ష్మజీవులు పూర్తిగా పోవు. ఇవి కలిగించే వ్యాధుల నుంచి గట్టెక్కాలంటే తిప్పలు పడక తప్పదు. ఎంత కడిగినా తొలగని సూక్ష్మజీవులను, పండ్లు, కూరగాయలపై ఉండే రసాయనిక వ్యర్థాలను పూర్తిగా తొలగించి, నిమిషాల్లోనే పరిశుభ్రంగా మార్చే సాధానాన్ని బ్రిటిష్ కంపెనీ 'సాండ్‌వే' రూపొందించింది. ఇది అల్ట్రాసోనిక్ తరంగాలను వెలువరించి ఆహార పదార్థాలను శుభ్రం చేస్తుంది. వివిధ రకాల ఆహార పదార్థాల కోసం ఇందులో ఐదు సెట్టింగ్స్ ఉన్నాయి. దీనిని స్విచాన్ చేసి, ఇందులో వేసిన పదార్థాలను తగిన సెట్టింగ్స్‌ను, దీని వెలుపల ఉండే టచ్ స్క్రీన్‌పై సెలెక్ట్ చేసుకుంటే, పది నిమిషాల్లో ఆహార పదార్థాలపై ఉన్న సూక్ష్మజీవులు, రసాయనిక వ్యర్థాలు పూర్తిగా నశిస్తాయి. పన్నెండు లీటర్ల సామర్థ్యంగల ఈ 'సాండ్‌వే' ఫుడ్ ప్యూరిఫైయర్‌ను పని పూర్తయ్యాక మడిచేసుకోవచ్చు. ఇది అల్ట్రాసోనిక్ తరంగాలను వెలువరిస్తూ, అతి సూక్ష్మమైన బుడగల ద్వారా హైడ్రాక్సిల్




అయాన్లను విడుదల చేస్తుంది. 'హైడ్రాక్సీ హైడ్రాలిసిస్' అనే ఈ ప్రక్రియ ఆహార పదార్థాలను పూర్తిగా సురక్షితంగా మారుస్తుంది.

## మినీ రోబో

చంద్రునిపై పరిశోధనల కోసం జపానీస్ ఆటబొమ్మల తయారీ కంపెనీ టోమీ బంతిలాంటి మినీ రోబోను రూపొందించింది. సోరా-క్యూ అనే ఈ రోబో పిల్లలు ఆడుకునే మామూలు బంతి పరిమాణంలోనే ఉంటుంది. దీని వ్యాసం ఎనిమిది సెంటీమీటర్లు. బరువు పావుకిలో మాత్రమే. జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ(జాక్సా) కోసం టోమీ కంపెనీ ప్రత్యేకంగా ఈ రోబోను రూపొందించంది. సోరా-క్యూ తొలి రోబో ఇటీవల 'స్పేస్ఎక్స్ ఫాల్కన్-9' రాకెట్ ద్వారా చంద్రుడి పైకి చేరుకుంది. జాక్సా ల్యాండర్ ఈ సంవత్సరం మరో సోరా-క్యూ రోబోను చంద్రుడి పైకి పంపించనుంది. ఈ రోబో చంద్రుడి ఉపరితలానికి చేరుకోగానే రెండు అర్ధగోళాలుగా విడివడి, వాటిని చక్రాలుగా ఉపయోగించుకుని ముందుకు సాగుతుంది. ఇందులోని నిశితమైన కెమెరాలు చంద్రుడి ఉపరితలంలోని విశేషాలను ఫొటోలు తీసి 'జాక్సా' కేంద్రానికి పంపిస్తుంది.



కథ

# మారిన సోము

రామాపురంలో రామయ్య, రాములమ్మ అనే దంపతులు వుండేవారు. వారికి ఇద్దరు కొడుకులు. పెద్దవాడి పేరు రాము, చిన్నవాడి పేరు సోము.

రాము రోజూ బడికి వెళ్లి, చక్కగా చదువుకునేవాడు. సోము బడికి వెళ్లకుండా అల్లరి పిల్లలతో కలిసి తిరుగుతూ, విలువైన కాలాన్ని వృథా చేసేవాడు. ఈ మధ్య సోములో వచ్చిన ఈ మార్పుకి అమ్మ, నాన్న తల్లడిల్లిపోసోగారు. రాము బడికి వెళ్లి చక్కగా చదువుకుంటుంటే అమ్మ, నాన్నకి ఆనందం కలిగినా, సోము బడికి వెళ్లకుండా అల్లరి చిల్లరగా తిరగటం వల్ల అమ్మా, నాన్నకి చాలా బాధ కలిగించేది.



"రోజూ బడికి వెళ్లి చదువుకుంటే బతుకు బాగుపడుతుంది. భవిష్యత్తు బాగుంటుంది" అని అమ్మ, నాన్న, అన్న ఎన్నో సార్లు చెప్పారు. అయినా సోము మారకుండా అలాగే వ్యవహరించసాగాడు. సోము భవిష్యత్తు పాడైపోతుందనే బెంగతో అమ్మ, నాన్న చాలా దిగులుతో వుంటూ సోముతో ఇదివరకులాగా అభిమానంతో మాట్లాడలేక చాలా బాధతో వుండసాగారు.

ఇదివరకులా అమ్మ, నాన్న తనతో మాట్లాడకపోవడం, అన్న రాముతోనే మాట్లాడుతూ, అభిమానంగా వుండటం సోము గమనించాడు. సోముకి చాలా బాధ కలిగింది. ఈ విషయమే రాముతో సోము ఒకరోజు చెప్పాడు.

"దానికి కారణం నీకు తెలియదా? చదువుకోకుండా చెడిపోతుంటే ఏ తల్లిదండ్రులైనా సంతోషంగా వుంటారా? అభిమానంతో మాట్లాడతారా? వాళ్లేమన్నా బండలు పగలకొట్టమన్నారా? మట్టితట్టలు మోయమన్నారా? ఇంటెడు చాకిరి చేయమన్నారా? గొడ్లు కాయమన్నారా? ఒళ్లు హూనమయ్యేలా కూలిపనులు చేయమన్నారా? నీకు, నాకూ ఏ కష్టం రాకుండా కడుపునిండా తిండి పెడుతున్నారు. కొత్త బట్టలు కుట్టిస్తున్నారు. బళ్లో ఫీజులు కడుతున్నారు. బాగా చదువుకోమని చెబుతున్నారు. చదువుకోవటం ఏమన్నా కష్టమైన పనా? హాయిగా వెళ్లి చదువుకోవచ్చు కదా. నువ్వు ఆ పని చేయటం లేదు. బడికి వెళ్లి చక్కగా చదువుకుంటే మన బతుకులే బాగుపడ్తాయి. మనం బాగుపడటమే వాళ్లు కోరుకునేది. వాళ్లు కోరుకునే పని నువ్వు చేస్తున్నావా? చేయటం లేదు. వాళ్లు బాధ పడకుండా ఎలా వుంటారు? నీతో అభిమానంతో ఎలా మాట్లాడుతారు? మన తిండికి, మన బట్టలకి, మన పుస్తకాలకి, మన ఫీజులకి.. ఇలా మన ఖర్చుల కోసం రెక్కలు ముక్కలు చేసుకొని డబ్బులు సంపాదిస్తేనే మనకు ఇవన్నీ సమకూరుతు న్నాయి. మనం కష్టపడకూడదని వాళ్లు కష్టపడని మనకి అన్ని సమకూరుస్తున్నారు. మరి నువ్వేం చేస్తున్నావు? బడికి రాకుండా, చదువుకోకుండా, వాళ్ల కష్టార్జితమంతా దోచుకుతింటూ– నీ విలాసాలకి, నీ జల్సాలకి, వాళ్ల డబ్బునంతా మంచినీళ్లప్రాయంలా ఖర్చు పెడ్తూ నువ్వు బాగుపడకుండా చెడిపోతూ వాళ్లని అంతులేని క్షోభకు గురి చేస్తున్నావు. ఇది నీకు న్యాయమేనా?" అని రాము సోముకి హితబోధ చేసాడు.

అన్ని రాము మాటలకి సోము చలించిపోయాడు. పశ్చాత్తాపంతో కళ్ల నుంచి కన్నీళ్లు జలజలా రాలాయి. అన్నని అభిమానంగా కౌగిలించుకొని "నిజమే అన్నయ్యా! నేను చాలా తప్పు చేస్తున్నాను. నాకు బుద్ధొచ్చింది. నీకులాగే రోజూ బడికి వెళ్తూ బుద్ధిగా చదువుకుంటాను. నీకు, అమ్మా నాన్నకి సంతోషం కలిగిస్తాను" అని సోము ఆ రోజు నుంచి బడికి వెళ్తూ బుద్ధి చదువుకోవటం ప్రారంభించాడు.

సోము మారినందుకు రాము, అమ్మ, నాన్న ఎంతో ఆనందించారు.ఆ రోజు నుంచి వాళ్ల ఇంట్లో మళ్లీ పండుగ వాతావరణం ప్రారంభమయింది.

- మా.శ్రీ.రాజు, పాల్వంచ

## బాలగేయం

### పల్లెటూరు



అందమైన పల్లెటూరు
ఆనందాల పూలతేరు
మకరందమే మాటతీరు
మమకారమే దాని పేరు.
అమ్మలోని కమ్మదనమే
పల్లెలోని మల్లెగుణమే
ఊరులోని పచ్చదనమే
గుబాళించే స్వచ్ఛదనమే.
ఊరిదంతా ఒకటే మాట
చేరునంట ఒకటే చోట
అందరిదీ ఒకటే పాట
అందరిదీ ఒకటే బాట.
మమత సమతల పందిళ్లు
మధుమాసపు పరవళ్లు
మానవతకే ఆనవాళ్లు
మచ్చలేని పల్లెటూళ్ళు

**- గుండాల నరేంద్రబాబు,** నెల్లూరు



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె.ప్రదీక్ష,** కాకినాడ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. అగ్నిపర్వతాల వలన నష్టాలేనా? లాభాలు కూడా ఉన్నాయా?**

**జవాబు: ప్రదీక్ష!** లాభనష్టాలనేవి ప్రకృతి సహజ లక్షణం. భూమి ఏర్పడిన తొలి దశలో అగ్నిపర్వతాల వల్లనే భూమి మీద సముద్రాలు, పర్వతాలు, పీఠభూములు, చదునైన ప్రదేశాలు ఏర్పడటం వల్ల అద్భుతమైన నైసర్గిక స్వరూపం రూపుదిద్దుకున్నది. లావా ప్రవహించిన నేల ఏ రైతూ ఊహించలేని విధంగా అత్యంత సారవంతమైనదిగా మారుతుంది. అగ్నిపర్వతాలు మొక్కలకు అవసరమైన కార్బన్ దయాక్సైడ్‌ను అందిస్తాయి. అగ్నిపర్వతాల నుంచి వెలుపలికి దూసుకువచ్చిన శకలాలను భవన నిర్మాణాలలో, రసాయన పరిశ్రమలలోను విరివిగా ఉపయోగిస్తారు. మరో విశేషమేమిటంటే- ఉత్తర కాలిఫోర్నియాలో అగ్నిపర్వత ప్రజ్వలనం వల్ల ఉత్పన్నమైన శక్తిని విద్యుచ్ఛక్తిగా మార్చి శాన్‌ఫ్రాన్సిస్కో నగరానికి విద్యుత్‌ను అందిస్తున్నారు.

**- కె.ఎస్.ప్రభు,** నాందేడ్

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. పెట్రోలు ఎప్పుడు వాడకంలో వచ్చింది?**

**జవాబు: ప్రభు!** పెట్రోలును 1835లో రష్యాలో కనిపెట్టినట్లు రికార్డులు వున్నప్పటికీ అంతకుముందు కొన్ని వందల సంవత్సరాల ముందు అనేక పేర్లతో వాడుకలో ఉన్నట్లు శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. టైటస్‌విల్ అనే చోట మొదటిసారిగా 1859 ఆగస్టు 27వ తేదీన, పెట్రోలు పైకి ఉబికింది. అమెరికాలో పెట్రోలు పరిశ్రమకు అదే నాంది అయింది. అయితే సముద్ర తీరప్రాంతాల్లోని ఇసుక భూమి పొరల్లో పెట్రోలు అధికంగా లభిస్తుంది. ఈ విధమైన భూభాగాలు ఉన్న దేశాలలో ఈ పరిశ్రమ స్థిరపడింది.



**రోజు** రోజుకీ టెక్నాలజీ విపరీతంగా పెరుగుతున్న క్రమంలో మనకు కావాల్సిన సమాచారం మొత్తం మన చేతిలో(స్మార్ట్ ఫోన్‌లో) ఉంచుకుంటున్నాం. అయితే కొంత మంది మన సమాచారాన్ని తెలుసుకోవడానికి హ్యాక్ చేస్తూ ఉంటాయి. ఈ మధ్య కాలంలో ఇది చాలా ఎక్కువైపోయింది. మన ఫోన్‌లో మన ప్రమేయం లేకుండా మనకు సంబంధించిన

# మీ మొబైల్ సురక్షితమేనా?

సమాచారం ఎవరైనా చూస్తున్నారా? లేదా? అని తెలుసుకోవడానికి కొన్ని మార్గాలున్నాయి.

## తెలియని అప్లికేషన్

ఆధునిక కాలంలో స్పైవేర్ ఇతర వ్యక్తులను గురించి తెలుసుకోవడానికి ప్యారంటల్ కంట్రోల్ యాప్స్ ఉపయోగించుకుంటారు. ఈ యాప్‌లలో ఒకదానిని ఉపయోగించి ఎవరైనా మీ ఫోన్‌లో స్పై చేస్తుంటే తెలుసుకునే అవకాశం ఉంది. కాబట్టి డౌన్‌లోడ్ చేసినట్టు మీకు గుర్తులేని ఏవైనా తెలియని అప్లికేషన్‌ల కోసం మీ ఫోన్‌లో సర్చ్ చేయవచ్చు. దీనికోసం నెట్ నానీ, కాస్పెర్స్కీ సేఫ్ కిడ్స్, నార్టన్ ఫ్యామిలీ యాప్స్ ఉపయోగపడతాయి.

## పర్ఫామెన్స్‌లో సమస్యలు

స్పైవేర్ మీ డేటాను ఎప్పటికప్పుడు సేకరించుకుంటుంది. అయితే మునుపటికంటే మీ మొబైల్ పర్ఫామెన్స్ విషయంలో తగ్గితే వెంటనే దానికి కారణాలు తెలుసుకోండి. స్మార్ట్‌ఫోన్‌ను ఎలా వేగవంతం చేయాలనే దానిపై ఆరా తీయండి, ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా? అని శోధించండి.

## బ్యాటరీ త్వరగా ఖాళీ అవడం

స్పైవేర్ నిరంతరం పని చేస్తుంటే, అది మీ బ్యాటరీని సాధారణం కంటే వేగంగా ఖాళీ చేస్తుంది. అయితే అన్ని బ్యాటరీలు క్రమంగా క్షీణిస్తాయి. అలా కాకుండా కారణం లేకుండా త్వరగా క్షీణించడం ప్రారంభమైతే దానికి కారణం తెలుసుకోండి. ముందుగా మీరు ఏదైనా కొత్త అప్లికేషన్స్ ఇన్‌స్టాల్ చేసారా? లేదా అప్డేట్ చేసారా చూడండి. కొన్ని యాప్స్ కూడా బ్యాటరీ త్వరలో ఖాళీ అవడానికి కారణం అయ్యే అవకాశం ఉంది.

## మొబైల్ ఫోన్ వేడెక్కడం

మీ మొబైల్ చాలా వేగంగా వేడెక్కుతుంటే ఎవరో మీ మొబైల్ హ్యాక్ చేస్తున్నారని అనుమానించండి. తక్కువగా ఉపయోగించినప్పుడు లేదా అసలే ఉపయోగించకుండా ఉన్నప్పుడు వేడెక్కుతుంటే తప్పకుండా దానికి కారణాలు తెలుసుకోండి.

## ఎక్కువ డేటా వినియోగం



మీ మొబైల్ ఫోన్‌లో అనుకోకుండా ఎక్కువ డేటా ఖాళీ అవుతుంటే స్పైవేర్ రన్ అవుతుందనే సంకేతం కావచ్చు. ఎందుకంటే నేరస్థుడు సమాచారాన్ని పొందటానికి యాప్ డేటాను ఉపయోగించాల్సి ఉంటుంది. కనుక డేటా వినియోగంలో పెరుగుదల చాలా ఎక్కువ ఉంటుంది.

## సర్చ్ బ్రౌజర్ హిస్టరీ

మీ మొబైల్ ఫోన్‌లో ఎప్పటికప్పుడు బ్రౌజర్ హిస్టరీ చెక్ చేసుకుంటూ ఉండండి. ముఖ్యంగా అందులో ఫోన్ స్పై సాఫ్ట్‌వేర్ గురించి ఏదైనా తెలుసుకోవడానికి ప్రయత్నించండి. ఎందుకంటే స్పైవేర్‌ని డౌన్‌లోడ్ చేయడానికి మీ బ్రౌజర్‌ని ఎవరైనా ఉపయోగించే అవకాశం ఉంది. బహుశా అలా జరిగినప్పుడు హిస్టరీలో మనకు కనపడుతుంది.

## మొబైల్ ఫోన్‌లో ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టడానికి మార్గాలు

స్పైవేర్ రిమూవ్ టూల్ ఉపయోగించండి: మీ ఆండ్రాయిడ్ ఫోన్ నుంచి స్పైవేర్‌ను తీసివేయడానికి రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించండి. ఇది స్పైవేర్(ఇతర రకాల మాల్వేర్ కోసం మీ పరికరాన్ని స్కాన్ చేస్తుంది. అదే సమయంలో దానిని పూర్తిగా తీసివేస్తుంది. అయితే దీని కోసం భద్రత

కలిగిన సాఫ్ట్‌వేర్ ఉపయోగించాలని గుర్తుంచుకోండి.

### ఆపరేటింగ్ సిస్టమ్ అప్డేట్ చేయండి

మొబైల్ ఫోన్ హ్యాక్ నుంచి తప్పించుకోవడానికి ఆపరేటింగ్ సిస్టమ్ అప్డేట్ చేయడం మంచిది. దీని ద్వారా పూర్తిగా తీసివేసే అవకాశాలు తక్కువగా ఉన్నప్పటికీ దాని వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదు. కనుక దీనికి ప్రత్యామ్నాయంగా ఏదైనా ఉపయోగించాలని సూచిస్తున్నాం.

### ఫోన్ ఫ్యాక్టరీ రీసెట్ చేయండి

ఫోన్ ఫ్యాక్టరీ రీసెట్ చేయడం వల్ల స్పైవేర్ పూర్తిగా తొలగించబడుతుంది. ఫోన్ ఫ్యాక్టరీ రీసెట్ చేస్తే ఫోన్‌లో ఉన్న అన్ని అంశాలు పోతాయి. మీరు ఏదైనా ఫోన్ తీసుకుంటే దాని



ని తప్పకుండా రీసెట్ చేయాలి. అంతేకాకుండా ఎప్పుడూ అన వసరమైన యాప్స్ డౌన్‌లోడ్ చేయకుండా ఉండాలి. ❑

## సమ్మర్ సెగలు

(9వ పేజీ తరువాయి)

### పిల్లలు వేసవిలో అనారోగ్యంపాలు కాకుండా తీసుకునే జాగ్రత్తలు

ఉదయం 8 గంటలలోపే పిల్లలకు చక్కగా గోరువెచ్చటి నీటితో స్నానాలు ముగించాలి. ఇంట్లో వాతావరణం చల్లగా ఉండే విధంగా చూసుకోవాలి. పండ్ల రసాలు, కొబ్బరినీళ్ల తాగడం ఆరోగ్యానికి మంచిది. తేలికగా అరిగే పదార్థాలు తినాలి. పలుచని లూజైన బట్టలు వేసుకోవాలి. ఎండలో ప్రయాణించేవారు గొడుగు, హెల్మెట్, గ్లౌజ్‌లు వాడాలి. రోజుకు కనీసం ఏడు లీటర్ల మంచినీరు తప్పనిసరిగా తీసుకోవాలి. తీసుకునే ఆహారంలో తగినంత ఉప్పు, నీరు, పోషక విలువలు ఉండే విధంగా చూసుకోవాలి. గది చుట్టూ చల్లటి గుడ్డలు వేలాడదీయాలి. ఎండలో బయటికి వెళ్లే సమయంలో చలువ కళ్లద్దాలు వాడాలి. పళ్లు, కూరగాయలు ఎక్కువగా తినిపించాలి. మసాలాలు తగ్గించాలి. పలుచటి, మెత్తటి కాటన్‌బట్టలు తొడగాలి. బయటికి వెళ్తే గొడుగు, టోపీ వాడాలి. దోమలు కుట్టకుండా రాత్రిపూట పైజామా లాల్చీ లాంటి బట్టలు తొడగాలి. బయటి ఆహారం తినకూడదు. తాజా ఆహారం మాత్రమే తీసుకోవాలి. బయటకి వెళ్లాలంటే సరైన సమయాలు ఎంచుకోవాలి. ఆటలు, ఈత నేర్పించాలంటే తెల్లవారుజామునే వెళ్లి ఎండ ముదరక ముందే ఇంటికి చేరుకోవాలి. టీకాలన్నీ సకాలంలో వేయించి, టీకాలతో నివారించగల వ్యాధులన్నిటినీ నిరోధించాలి. తాతలు, అవ్వలతో గడపడానికి పల్లెలకి వెళ్లినప్పుడు జాగ్రత్తలు పాటించాలి.

### వేసవిలో చర్మ సంరక్షణ

రోజంతా చర్మంపై తేమ ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం వాటర్ కలిసిన మాయిశ్చరైజింగ్ క్రీమును, రోజ్ వాటర్‌ను రాసుకుంటే మంచిది. రోజుకు వీలైనన్ని సార్లు చల్లటి నీటితో ముఖం కడుక్కోవాలి. వేసవిలో వచ్చే ఇన్‌ఫెక్షన్లు చలి తగ్గి ఎండలు ముదరక ముందే ఆటలమ్మ పిల్లల మీద దాడి చేస్తోంది.



అది ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తుంది. గవదబిళ్లలు, టైఫాయిడ్, పొంగు, హైపటైటిస్ 'ఎ' కామెర్లు కూడా ఎండాకాలం బాగా వ్యాపిస్తాయి. ఎండ వేడి బాగా తగిలినప్పుడు శరీర ఉష్ణోగ్రత బాగా పెరుగుతుంది. ఎండలు బాగా పెరుగుతున్నప్పుడు ప్రజలు జాగ్రత్తగా తీసుకోవాలి. వడదెబ్బ మొదలైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎండా కాలంలో వీలైనంత ఎక్కువగా నీళ్ల తీసుకుంటూ ఉండండి. ఆల్కహాల్, టీ, కాఫీ వంటి వాటికి దూరంగా ఉండాలి. ఏది ఏమైనా మానవ స్వయంకృతం ఇది..

అభివృద్ధి పేరిట చేస్తున్న విచ్చలవిడి దాష్టీకం ఇది. గ్లోబల్ వార్మింగ్ అని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా, పర్యావరణ పరిరక్షకులు గగ్గోలు పెడుతున్నా చూసీ చూడనట్టు మొద్దు నిద్ర నటిస్తున్న ప్రభుత్వాల తెంపరితనం ఇది. ఏదైతే మాకేం మేం బాగానే ఉన్నాంగా... అని ఆలోచించే ప్రజల నిర్లక్ష్యం ఫలితం ఇది. అందరికీ అన్నీ తెలుసు. కానీ చూసి చూడనట్టు నటిస్తున్నారు. మానవులు అందరూ వారి వారి పనులలో బిజీగా గడుపుతున్నారు. ఈ బిజీ లైఫ్‌లో ఏ పనిని కూడా వాయిదా వేయలేని పరిస్థితి. అందుకే ఎండైనా, వానైనా బయట తిరగాల్సి రాక తప్పని పరిస్థితి. అందుకే ఇప్పటికైనా కళ్లు తెరిచి వాస్తవాలు గ్రహిస్తే మంచిది. ప్రభుత్వాలు కూడా రాబోయే ఉపద్రవాలను ఊహిస్తూ తగిన ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలలో పర్యావరణం పట్ల అవగాహనను దానిని కాపాడవలసిన ఆవశ్యకతను విరివిగా ప్రచారం చేయాలి. సమూహాలుగా, వ్యక్తులుగా, పర్యావరణం పట్ల కాసింత శ్రద్ధ కనబరిచేలా ప్రోత్సాహకాలు అందించాలి. అప్పుడే భావితరాలకు ఆరోగ్యకర, ఆనందకర వాతావరణాన్ని కల్పించగలం. అదే సమయంలో ఎవరికి వారు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటిస్తూ, కొద్దిగా శ్రద్ధ వహిస్తే ఈ ఎండాకాలం కూడా ఆనందంగా గడిపేయవచ్చు. ❑

కథ

# సముద్ర తీరం

**- దొండపాటి కృష్ణ**

**మనుషులతో ఆ ఇల్లంతా నిండుగా ఉన్నప్పటికీ అదిప్పుడు నిశ్శబ్దాన్ని నింపుకున్న ఖాళీ కుండలా ఉంది. "ఇదిగో ఇక్కడ సంతకం పెట్టు" అని విమల ముందు రిజిస్ట్రేషన్ ఫారంని పెట్టింది దీప్తి.**

**"ఈ రెండున్నర ఎకరాల్ని ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేయండి. మీ తర్వాతెలాగూ ఈ ఇల్లు మాదేగా" అన్నాడు. వికాస్.**

**"ఈ ఇంటి మీద కూడా కన్ను పడిందా?" అన్నట్లు అల్లుడి వైపు చూశాడు అయోధ్య.**

**విమల నుంచి ఎటువంటి సమాధానం లేదు. ఆమె ఓ నిశ్శబ్ద విస్ఫోటనంలా కన్పిస్తోంది.**

విమలకు పిల్లల్లేరు. దాంతో కొందరు గొడ్రాలు అనసాగారు. సీమంతాలకు, పేరంటాలకు పిలవడం మానేశారు.

ఒకానొక రోజున అయోధ్యను ఒప్పించి, దీప్తిని దత్తత ఇప్పించింది విమల పెద్దక్క శ్యామల.

మొదట్లో విమలకు ఇష్టం లేకపోయినా రాన్రాను అలవాటు పడింది. దీప్తిని చేరదీసి కన్నకూతురిలానే చూసుకుంది.

స్వయానా అక్కే తన కూతురికి మంచి జీవితం అందిస్తుండడంతో పొంగిపోయింది సుశీల.

దీప్తికి పెళ్లీడు రాగానే సంబంధాలు వెతికారు. అన్ని విధాల సరిజోడి అని వికాస్ సంబంధాన్ని తీసుకొచ్చింది సుశీల.

"మా అబ్బాయి రెవిన్యూ డిపార్ట్‌మెంటులో పని చేస్తాడు. ఎంత లేదన్నా ఇరవై లక్షల కట్నం వస్తుంది. మీ సంబంధం మాకు బాగా నచ్చింది. కట్నంగా ఆ రెండున్నర ఎకరాల భూమిని అమ్మాయి పేర రాయండి. వెంటనే ముహూర్తాలు పెట్టించేద్దాం" ప్రతిపాదించారు వికాస్ తల్లిదండ్రులు.


"కట్నంగా ఆ భూమిని ఇవ్వలేం. ఆ పొలం మీద ఎవ్వరికీ హక్కు లేదు. దాన్నో ఆశయం కోసం ఉంచాం. మన్నించాలి" సున్నితంగా తిరస్కరించింది విమల.

ఒక సంబంధం ఖాయం కావాలంటే ఎవరో ఒకరు రాజీ పడాల్సిందే. సుశీల మధ్యవర్తిగా ఉండి రాజీ కుదిర్చింది.

అప్పుడు ఆమె ఆలోచనను విమల పసిగట్టలేకపోయింది. సుశీల దురాలోచనకు ఈరోజు రిజిస్ట్రేషన్ పేపర్స్ సాక్ష్యాలుగా నిలిచాయి.

ఆ భూమిని దేనికోసం ఉంచారో సుశీలతో పాటుగా దీప్తికీ తెలుసు.

పెళ్లయిన దగ్గర్నుంచి ఆ భూమి కావాలని పదే పదే



అడుగుతోంది. దాంతో విమల, శ్యామలతో మంతనాలు జరిపింది. చైతన్య గురించి ఎదురు చూస్తోంది. అవన్నీ గ్రహించిన దీప్తి, ఇక ఆ భూమి తనకు దక్కదని భావించి ముందస్తు జాగ్రత్తగా రిజిస్ట్రేషన్ పేపర్స్‌తో పాటుగా దిగిపోయింది.

"నిమ్మచెట్టుకెంత నీరు పోసినా చాలదన్నట్లు నీకెంత చేసినా చాలదేమే?" దీప్తిపై స్వరం పెంచింది శ్యామల.

"నువ్వాగు పెద్దమ్మా, నీకేం తెలియదు. ఇందులో జోక్యం చేసుకోకు" వారించింది దీప్తి.

"నిన్ను దత్తత ఇప్పించిందే నేను. అలాంటిది నాకేం తెలియదా?"

శ్యామలలో ఆవేశం ఒక్కో అడుగు వేసుకుంటూ నిలబడసాగింది.

"అయితే ఈ ఘనకార్యం కూడా నీ చేతుల మీదుగానే కానివ్వు. ఈసారి ఆడపిల్ల పుడితే నీ పేరే పెట్టుకుంటా" వెటకారంగా అంది దీప్తి.

"పెట్టిపోతలు బాగానే పెట్టింది కదా! దత్తత కూతురైనా సొంత కూతురికి చేసినంత ఘనంగా పెళ్లి చేసిందిగా! కూటికి కక్కుర్తి పడకుండా దారి చూపిస్తే మమ్మల్నే అంటావే" కొంగు బిగించింది శ్యామల.

"ఏంటి ఇచ్చింది ముష్టి మూడు లక్షలు. ఆడపడుచులకిచ్చింది పది వేలు. పుట్టింటి నుంచి ఏం తెచ్చావమ్మాయ్?" అని చుట్టాలు అడుగుతుంటే తల తీసేసినట్లుంది. అయినా నేనేమన్నా నా పేర రాయమంటున్నానా? నా కొడుకు పేరు మీదనే కదా" వాదనకు దిగింది దీప్తి.

"ఆ భూమి రాసివ్వడం కుదరదని ఎన్నిసార్లు చెప్పినా తలకెక్కదా? పెద్దమ్మ ఇచ్చిందే చాలా ఎక్కువ. ఇంకిక్కడ రాద్ధాంతం చేయమాక" బయలుదేరమన్నట్లు గడప వైపు దారి చూపించింది శ్యామల.

"అలాంటప్పుడు దత్తత తీసుకోవడమెందుకంటా? నా బతుకునిట్టా రోడ్డుకు లాగడమెందుకంటా? మీ అమ్మా నాన్నలు ఎవరంటే ఎవరి పేర్లు చెప్పాలో తెలియకుండా చేయడమెందుకంటా?" చీదరించుకుంది దీప్తి.

**"చైతన్యా, ఈ డబ్బుల్తో ఏం చేస్తావ్? నీ గోల్ ఏంటి?" ఏడో తరగతిలో క్లాస్ ఫస్ట్ వచ్చిన చైతన్యకు డబ్బులిస్తూ సభాముఖంగా అడిగాడు నగదుదాత. "మా పిన్నికిలాగా పిల్లల్లేనివాళ్లకి కొడుకునవుతా" చెప్పాడు.**

"ఏంటే వాగుతున్నావ్?" కోపంతో దీప్తిపై చేయి చేసుకుంది శ్యామల.

అక్కడే ఉన్న సత్యం, అయోధ్యలు ఉలిక్కిపడ్డారు.

అప్పటిదాకా మౌనంగా ఉన్న సుశీల ఆ సంఘటనకు భద్రకాళి అయ్యింది.

"పిల్లను దత్తత తీసుకున్నదానివి వాళ్ల చిన్న చిన్న కోరికలు కూడా తీర్చలేకపోతే ఎందుకక్కా.. తర్వాత తింటానికి ఎవరున్నారని ఇవ్వనంటున్నావ్? ఇంత కఠినమైనదానివి కాబట్టే నీకు పిల్లలు పుట్టలేదు. గొడ్రాలివయ్యావు. ఆ గత్తర నిన్ను మింగ, నీకు రోగం రాను, తప్పకుండా పిల్లల ఉసురు తగులుతుంది" అంటూ శివాలెత్తిపోతూ చేతిలో ఉన్న రుమాల్ని విమల మొహంపైకి విసిరింది సుశీల.

"నువ్వు నన్ను పెంచిన తల్లివి కాదు. పీక్కుతినే దయ్యానివి. ఎంతైనా పెంచిన తల్లి పెంచిన తల్లేనని నిరూపించావ్. నిజంగానే నువ్వు గొడ్రాలివి. సమాధుల్లాంటి ఈ ఇంట్లో నేనుండలేనమ్మా" అంటూ బావి దగ్గరికెళ్లి బిందెతో తల మీద నీళ్లు పోసుకోబోతుంటే అడ్డుకున్నాడు సత్యం.

ఊళ్లో ఎంత మంది గొడ్రాలు అన్నా ఎప్పుడూ బాధపడని విమల ఈరోజు చెల్లెలు సుశీల, కూతురు దీప్తి నోటినుంచి ఆ మాటల్ని విని తట్టుకోలేకపోయింది. బిందెతో తలపై నీళ్లు పోసుకోవడానికి ప్రయత్నించిందంటే తనని చనిపోయినట్లుగా జమ కట్టినందుకు కుమిలి కుమిలి ఏడ్చింది.

"ఇంత జరుగుతున్నా మాట్లాడేవంటక్కా? దత్తత తీసుకున్న కూతురుకన్నా నీకు చైతన్యనే ఎక్కువయ్యాడా? అట్టయితే ఆడికే తగలెట్టేయ్" ఏడుపు లంకించుకుంది సుశీల.

"ఆస్తినంతా తీసుకెళ్లి అన్నయ్యకే తగలెట్టు" ఈసడించుకుంది దీప్తి.

"అందరూ వాడినంటారు. మధ్యలో వాడి సంగతెందుకే" దీప్తిపై అరిచాడు సత్యం.

"ఈ నాటకమంతా వాడికోసమేగా! నాకు తెలీదా మీ వేషాలు" ముక్కు చీదింది దీప్తి.

చైతన్యపేరు ప్రస్తావనకొచ్చిన ప్రతిసారీ విమల గుండె అదిరదిరి పడుతోంది. ఆమెలోని ప్రతి అణువణువూ ఆ పేరును స్మరించడంలో మునిగిపోతోంది. అతన్ని వాళ్లు అపార్థం చేసుకోవడం ఆమెను మరింత బాధించింది. అప్పటిదాకా సాధారణంగా కొట్టుకుంటున్న గుండె తన వేగాన్ని అందుకొంది.

"చైతన్య.. నా బంగారు చై..త..న్య.." ఏదో చెప్పబోతూ రెండు చేతుల్ని గుండె దగ్గర పెట్టుకుని కూలిపోయింది విమల.

...

మేఘాల పురిటి నొప్పుల నుంచి సజీవంగా బయటపడిన అరుణోదయ కిరణాలు కిటికీగుండా ప్రవేశించాయి. సరాసరి చైతన్య మొహాన్ని తాకాయి. జవసత్వాన్ని నిండా నింపుకొని మేల్కొన్నాడు. చేతిలోకి మొబైల్ తీసుకున్నాడు. సమయం ఉదయం పది గంటలు దాటింది. సోషల్ మీడియా యాప్ ఓపెన్ చేశాడు. అప్పుడే తల్లి శ్యామల నుంచి ఫోనొచ్చింది.

"ఏంటమ్మా? ఇంత పొద్దున్నే చేశావ్?" అడిగాడు. ఈ రోజు ఆఫీసుకు సెలవు.

"విమలపిన్ని నిన్నే కలవరిస్తోందిరా, నిన్ను చూడాలంటోంది" బాధను దిగమింగుకుంటూ జరిగింది చెప్పింది శ్యామల.

"అప్పుడు నా మీద ప్రేమను చెల్లెలు మీదకు ట్రాన్స్ ఫర్ చేశారు. ఇప్పుడు చెల్లెలు ఎదురు తిరిగేసరికి నన్ను కలవరిస్తోందా?" అడుగుతుంటే గొంతు గద్గదమైంది.

"ఒరేయ్ ఫూల్, నువ్వంటే సముద్రమంత ప్రేముంది కాబట్టే అంత పెద్ద కంపెనీలో జాబ్ వచ్చేలా చేసింది. నిన్నో స్థాయికి తీసుకొచ్చి"

"వాట్...?" స్థాణువై నిలబడ్డాడు చైతన్య.

"అవును. మీ పిన్ని నిన్ను తలవని రోజు లేదు, క్షణం లేదు. నీ గమ్యానికి ఆమె మెట్లుగా మారింది. నీ విజయ పతాకానికి ఆమే ఓ దారంలా మారింది. నిన్ను వెలుగులోకి తీసుకురావడానికి ఆమె మా వెనక నిలబడింది. ఒక్కోసారి అనిపిస్తూ ఉంటుంది. నిన్ను కన్నది మేమా? లేదా ఆమెనా అని. అంతలా నీ కోసం తపన పడింది, పడుతూనే ఉంటుంది" చెప్పాడు.

"ఇవన్నీ కట్టు కథలు.." కొట్టిపడేశాడు చైతన్య.

"అయితే మీ మేనేజర్‌ని కనుక్కో.. నిజం తెలుస్తుంది" ఫోన్ పెట్టేశాడు సత్యం.

పిన్నంటే అమ్మ తర్వాత అమ్మ లాంటిది. కానీ చైతన్యకు అమ్మ కన్నా పిన్నే ఎక్కువ. ఎంతో ప్రేమ, అనురాగం, ఆప్యాయత! ఇంట్లో కన్నా పిన్ని ఇంట్లోనే ఎక్కువగా ఉండేవాడు. ఒక్కోసారి అక్కడే పడుకునేవాడు. వాళ్లిద్దరి బంధం తీరానికి అలకు మధ్యనున్న సుదూర బంధం లాంటిది. ఎప్పటికీ ఒకే అంశ కాదు. అలా అని వేరూ కాదు.

"చైతన్యా, ఈ డబ్బుల్తో ఏం చేస్తావ్? నీ గోల్ ఏంటి?" ఏడో తరగతిలో క్లాస్ ఫస్ట్ వచ్చిన చైతన్యకు డబ్బులిస్తూ సభాముఖంగా అడిగాడు నగదుదాత.

"మాపిన్నికిలాగా పిల్లల్లేనివాళ్లకి కొడుకునవుతా" చెప్పాడు.

ఆ క్షణంలో విమల కళ్లు తరగని ఆనందబాష్పాలను నింపుకుంది. చైతన్య ఎంతో ఉన్నతంగా కనిపించాడు. తనకున్న రెండున్నర ఎకరాల్లో పిల్లలు లేని వృద్ధుల కోసం ఆశ్రమం కట్టాలని ఆ క్షణంలో నిర్ణయించుకుంది.

అయోధ్య అందుకు 'సై' అన్నాడు.

ఆరోజు నుంచి చైతన్యను పల్లెత్తు మాట అనలేదు. చదువుకోమని ఏనాడూ చెప్పలేదు. క్లాస్ ఫస్ట్ వచ్చినవాడికి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదనేది. చిన్న తప్పు చేసినా వెనకేసుకొచ్చేది. బాగా గారాబం చేసింది.

మూడేళ్లలో అతని చదువు అటకెక్కింది. చైతన్య పదో తరగతి తప్పాడు. మొదటిసారి శ్యామల, సత్యం కూడా విమలను విమర్శించారు. ఆమె వల్లనే అతనలా చెడిపోయాడని తిట్టారు. ఆ బాధలో చైతన్యపై చేయి చేసుకుంది విమల. ఎంతగానో ప్రేమించే పిన్నే దండించేసరికి ఆమెపై అలిగి వాళ్లింటికి వెళ్లడం మానేశాడు చైతన్య.

తప్పైపోయిందని, ఇంకెప్పుడూ కొట్టనని, ఇంటికి రమ్మని బతిమాలింది విమల.

అలకపాన్పు దిగలేదు చైతన్య. వెళ్లకుండా ఉంటేనే తన విలువ తెలుసొస్తుందనుకున్నాడు.

విమల మనోవేదనకు గురైంది. ఆవేశంలో చైతన్యను కొట్టినందుకు తన చేతిపై అట్లకాడను కాల్చి అంటించుకుంది.

అది తెలిసి శ్యామల పరిస్థితిని చక్కదిద్దడానికి దీప్తిని దత్తతగా ఒప్పించి తీసుకొచ్చింది.

దీప్తిని దత్తత తీసుకోవడం చైతన్యకు ఇష్టం లేదు. అతని అలకపాన్పు పెద్దదైంది. నెల రోజులకు అది చిన్నదైంది. మొహమాటంగా ఎవరో అపరిచితుల ఇంటికి వెళ్లినట్లుగా విమల ఇంటికి వెళ్లాడు.

"హాయ్ దీప్తి! ఎలా ఉన్నావ్?" పలకరించాడు.

"బాగున్నానన్నయ్యా.. దా.. కూర్చో. అమ్మను పిలుస్తానండు. అమ్మా... అమ్మా" అని విమలనే పిలుస్తోంది అనుకున్నాడు చైతన్య.

బయటకొచ్చిన సుశీలను చూశాకగానీ బోధపడలేదు.

"బాగున్నావా చైతన్యా? ఏంటి విశేషాలు? చెల్లి చెప్పింది.. నువ్వసలు అక్కతో మాట్లాడడం లేదంట, ఏమైంది" ఆరా తీసింది.

నీళ్లు నమిలాడు చైతన్య.

"ఏదైతేనేం.. మంచికే జరిగిందిలే. నువ్వు అలగబట్టే ఇది దత్తతకొచ్చింది".

"విమలపిన్ని లేదా?"

రెండు నెలల క్రితం వరకూ తన సామ్రాజ్యమైన ఆ ఇంట్లోకి ఓ అపరిచితుడిలా చూశాడు.

"వీళ్లకి నువ్వు మళ్లీ దగ్గరైతే బతుకు మళ్లీ గొడ్లచావిట్లోకే. ఎలాగూ అలిగి దూరమైపోయావు. అలాగే ఉండిపో. పై చదువులు చదువుకుని దేశాలు వెళ్లిపోయేవాడివి ఇప్పుడెందుకు వాళ్లను కలవడం. దీని భవిష్యత్ దూరం చేయడం.. సుబ్రంగా సదువుకోరా.. ఇటు రామాక.. పుణ్యం ఉంటుంది".

చైతన్యలో ఆలోచన మొదలైంది. ఆర్థికంగా వెనకబడిన వారి జీవితాల్లో కొస్తున్న వెలుగుని దూరం చేయడానికి కారణం కాకూడదనుకున్నాడు. తన మీద ప్రేమే ఉండి ఉంటే దత్తత ప్రసక్తే వచ్చేది కాదనీ, తన మీద ప్రేమ లేదని తీర్మానించుకున్నాడు. సప్లిమెంటరీ రాసి పదో తరగతి పాసయ్యాడు. కాలేజీ చదువులకు దూరాలు వెళ్లాడు.

వాళ్ల గురించి తను ఆలోచిస్తున్నాడు కానీ వాళ్లు మాత్రం ఎప్పుడూ తన గురించి ఆలోచించట్లేదని, కనీసం ఫోన్ కూడా చేయడం లేదని బాధపడి, వాళ్ల గురించి ఆలోచించడం మానేశాడు.

మేనేజర్‌తో మాట్లాడాడు. తన ఉన్నతిలో వాళ్ల హస్తం ఉన్నందుకు తనని మునుపటిలా ఇంకా ప్రేమిస్తున్నందుకు ఆశ్చర్యపోయాడు.

"ఇన్నాళ్లు నాకెందుకు చెప్పలేదమ్మా?" తిరిగి తల్లికి కాల్ చేశాడు.

"నువ్వెప్పుడూ మాకా అవకాశాన్ని ఇవ్వలేదు" అందామె.

అహం కళ్లు మూసుకుపోయేలా చేస్తుంది. విచక్షణా జ్ఞానాన్ని విస్మరిస్తుంది. మనవాళ్లను దూరంగా, పరాయివాళ్లను దగ్గరగా చేసి ఆడిస్తుంది. కావాల్సిన మనిషి దూరమైతేనో, దూరం కాబోతున్నారంటేనో మనలో పేరుకున్న అహం కరుగుతుంది. అలా జ్ఞాపకాల దొంతరలు అతనిలోని అహాన్ని కరిగించాయి.

...............

ఆఘమేఘాల మీద హాస్పిటల్‌కొచ్చాడు చైతన్య. అణచుకోలేని భావోద్వేగాలు కన్నీళ్ల రూపంలో బయటకొచ్చాయి. వేలు పట్టుకుని ఊరంతా తిప్పిన పిన్ని వెంటిలేటర్ మీద అచేతనంగా ఉండటాన్ని చూసి భోరుమన్నాడు. ఆకాశంలో నక్షత్రాలను చూపించి ఎన్నో కబుర్లు చెప్పిన నోటికి ఆక్సిజన్ అందించడాన్ని చెంగు చెంగుమంటూ ఉరకలేసిన శరీరానికి ఎక్కిస్తున్న సెలైన్‌ను చూడలేకపోయాడు.



"దత్తత తీసుకోకుండా ఉన్నా నా దీపం ఆరిపోయేది కాదు. నా వల్లే.. అంతా నా వల్లే" చైతన్యను కౌగిలించుకని నెత్తి కొట్టుకున్నాడు అయోధ్య.

అతని వంక గుచ్చి గుచ్చి చూశారు ముగ్గురు. ఆ చూపులు ఒక నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నాయి.

అప్పుడే విమల స్పృహలోకొచ్చింది.

"చైతన్యా.. నా బంగారం.." ఆమె మాటలు ఆమెకే వినిపించలేదు.

ఓపిక చేసుకుని సెలైన్ బాటిల్‌ను లాగింది. ఆ శబ్దానికి అందరూ ఆమె వైపు చూశారు.

"నన్ను క్షమిస్తావా అమ్మా.." ఆమె రెండు చేతుల్ని పట్టుకుని అతని మొహానికి ఆనించుకున్నాడు.

"నువ్వసలు తప్పు చేస్తే కదా.." అతని తల నిమిరింది.

"అహంకారంతో ఇన్నేళ్లు నిన్ను దూరం చేసుకున్నాను కదా.. నన్ను క్షమించమ్మా.. నిన్నిక వదలిపోనమ్మా.."

"నాకిప్పుడా అదృష్టం లేదు.."

"అలా అనకమ్మా.. నీకేం కాదమ్మా"

"నాకేం కాకూడదంటే అది తీసుకో.." పొలం కాగితాలను ఇమ్మని అయోధ్యకు సైగ చేసింది విమల.

లోపల సంచిలో నుంచి తీసి వాటిని విమలకివ్వబోతుంటే చైతన్య చేతిలో పెట్టమంది.

అలాగే చేశాడు అయోధ్య.

వాటిని తీసుకుని చదివాడు చైతన్య. అతని పేరు మీద డాక్యుమెంట్స్ ఉన్నాయి. తలెత్తి దీప్తి బంధుగణం వంక చూశాడు, వాళ్లు మొహం చిట్లించుకున్నారు.

చిరు మందహాసం చేశాడు. ఆ నవ్వులో జాలి తొణికిసలాడింది. దాన్ని కనిపెట్టే వారెవ్వరూ లేరక్కడ.

"ఆ రెండున్నర ఎకరాలు చెల్లివే.." డాక్యుమెంట్స్ మడుస్తూ అన్నాడు చైతన్య.

"అదేంటి? అది నీ పేరు మీద కదా రాయించింది.." చైతన్య చేతిలోని డాక్యుమెంట్స్ తీసుకుని చూశాడు అయోధ్య.

దీప్తి కూడా ఆ డాక్యుమెంట్స్ పరిశీలించింది. అవి చైతన్య పేరు మీదనే ఉన్నాయి. అన్నయ్య ఎందుకలా అన్నాడోనని ఆశ్చర్యంగా చూసింది.

"ఎవరి పేరు మీద ఉంటే ఏం బాబాయ్. అందరూ మనోళ్లే కదా.. పిన్ని ఆశయం బతకడం ముఖ్యం. రేపే చెల్లి పేరు మార్చేస్తాను" సంతోషంగా ఉండండి తల్లీ" అన్నట్లు దీప్తి తల నిమిరాడు చైతన్య.

వికాస్, సుశీలలు అక్కడ జరిగే తతంగాన్ని "నిజమా? కాదా?" అని నోరెళ్లబెట్టి చూస్తుండిపోయారు.

అన్నయ్య పట్ల తన సంకుచితత్వానికి తల దించుకుంది దీప్తి.

'వీడికి కావాల్సింది ప్రేమ.. పొలం కాదు..' బెడ్ మీద నుంచే చేయి చాపించి విమల.

"నీ ఆశయాన్ని నేనెప్పుడూ మర్చిపోలేదమ్మా.. ఆశ్రమాన్ని కట్టి నీ ఆశయం నెరవేరుస్తాను" అని ఆమె చేతిలో చేయి వేశాడు చైతన్య.

విమలలో కన్నీళ్లు జలజలా రాలాయి.

ఆ దృశ్యాన్ని చూసి శ్యామల కళ్లల్లోని ఆనందబాష్పాలు తమ ప్రవాహాన్ని పెంచాయి.

# కవితాక్షరాల జ్వాలాతోరణం 'అలిశెట్టి'

తెలంగాణ సాహితీ సీమలో అలిశెట్టి ప్రభాకర్ వచన కవిగా నాటి సమాజం గుండెలోతులను స్పృశించిన కవితా హృదయంతో విప్లవ స్వాప్నికత సృష్టించారు. అభ్యుదయ ప్రగతిశీల భావాలు, ఆధునిక సాహిత్యాన్ని వివిధ ప్రక్రియలలో ప్రతిబింబింపచేస్తున్న సమరోత్తేజ నేపథ్యంలో జగిత్యాలలో, ఆ యువ కవి గళం, నాటి సమాజంలోని పీడిత జనావళి అనుభవిస్తున్న పేదరికం, జీవన వ్యథ, వేదనపై కవితా రూపకంగా ఏకాకిగా నడక ప్రారంభించారు. సుమారు రెండేళ్లపాటు పత్రికలకు రచనలు పంపుతున్నా నిరాశా నిస్పృహలు తప్ప మిగిలింది లేదు. 1975లో తొలిసారిగా ఆయన రాసిన ఆరు వరసల మినీ కవిత రావడంతో, ప్రభాకర్‌తో క్రమేపీ నాటి యువ కవుల సరసన స్థానం లభించింది. 1977లో ప్రముఖ కవి శివారెడ్డి ముందుమాటతో తొలి సంకలనం 'ఎర్ర పావురం' వెలువడింది. తన ఆరోగ్యాన్ని, కుటుంబ సుఖసంతోషాలను పణంగా పెట్టి రాజీ లేని జీవన దని తెలిసినా చాలా నిర్లక్ష్యంగా కవిత్వమే శ్వాసగా ఆరోగ్యాన్ని పట్టించుకోలేదని మిత్రులు అంటారు.

**"డబ్బు మనిషిలా నువ్వు**
**జబ్బు మనిషిగా నేను**
**అందుకే../నువ్వెప్పుడు డాక్టరువి/నే పేషెంటుని".**

వ్యంగ్యమైన కవితల్ని అలవోకగా మినీ కవితలుగా రాస్తూనే అంతిమ శ్వాస వరకు కవిగా జీవించారు. అక్షరాలను ప్రేమిస్తూ అలుపెరుగని పోరాటంతో శ్రమించారు. నగరంలో అస్థిపంజరాల్ని స్పందించింది.

**"తను శవమై/ ఒకరికి వశమై**
**తనువు పుండై/ ఒకడికి పండై**
**ఎప్పుడూ ఎడారై**
**ఎందరికో ఒయాసిస్సై"**

ఆంధ్రజ్యోతి వారపత్రికలో వెలుగు చూసిన 'వేశ్య' కవిత (రక్తరేఖలో తొలి కవిత) ఒక విషాద స్మృతిగా ప్రతిధ్వనించింది. యుక్త వయసులో, కుంచె చేపట్టిన కళాకారునిగా, ఫొటో స్టూడియోలో కెమెరాతో భావాలు పలికించే ఛాయాచిత్రకారునిగా క్రమేపీ బాధాతప్త కవితా కథనాలకు ప్రాణం పోసే కవిగా క్షుద్బాధ, జీవితానుభవాల నుంచి కవితా సృజనాత్మకత వెల్లివిరిసింది. జగిత్యాల ఉద్యమ చైతన్యస్ఫూర్తితో ఆర్తి, ఆవేదనల ఆర్ద్రతానురక్తి ధిక్కార దిశలో జీవితం, నాటి సమాజాన్ని ఎదురు ప్రశ్నించడం, నిలదీయడం ఆరంభమైంది. అలిశెట్టి, బళ్ళకొద్దీ బరువు, సాహిత్యం సృష్టించలేదు. దోపిడీకి గురవుతున్న కష్టజీవుల శ్రమ, కన్నీళ్లు, వ్యక్తిగా తాను అనుభవిస్తున్న అనుభవాల బతుకు నుంచి క్రమేపీ ఆరోగ్యాన్ని, బతుకుతెరువును కూడా పట్టించుకోని నైజం జీవితాదర్శం అయింది. కన్నీరు ఆవిరై రక్తరేఖ ప్రభవించింది.

జగిత్యాల సాహితీ మిత్ర దీప్తి 1975-77 నాటి రోజులలో.. మిత్రులు అచ్చెరువొందే రేఖాచిత్రాలు సృష్టించే ప్రభాకర్ తనను తాను నిలదొక్కుకోవడానికి, గుర్తింపుకు శారీరకంగా, మానసికంగా కుంగిపోతున్నా అక్షరాలు ఆసరాగా పోరాటం ప్రారంభించిన ప్రభాకర్, అగ్ని వర్షం లాంటి కవితలతో నాటి క్షుద్ర రాజకీయాలపై ధ్వజం ఎత్తారు.




**"ఒక నక్క**
**ప్రమాణ స్వీకారం**
**చేసిందట**
**ఇంకెవర్నీ మోసగించనని**
**ఒక పులి పశ్చాత్తాపం ప్రకటించింది**
**తోటి జంతువులను సంహరించినందుకు.**
**ఈ కట్టుకథ విని**
**గొర్రెలింకా**
**పుర్రెలూపుతూనే ఉన్నాయ్"** అన్నారు.

జగిత్యాలలో ఉన్న రోజులలోనే నిర్బంధపు తుపాకీ మొన మీద, "కొమ్మ ఉండీ ఊగని/కొలిమి ఉండీ మండని/ జీవితలెందుకని?" తెగువతో ప్రశ్నించారు.

1983-84 నాటికి ప్రస్తుత నేటి నిజం పత్రిక ఎడిటర్, బైస దేవదాస్ ఆదరణతో అక్కడ వుండగానే రెండు కవితా సంపుటిలు ముద్రింపబడి వెలుగు చూసాయి.

**స్వయంగా శవాలే/రాబందుల వద్దకే నడిచొస్తుంటే/అంతకంతకూ పెరుగుతున్న అజ్ఞాత పర్వతం/చిన్న బ్యాలట్ పెట్టెలో ఇమిడిపోతే/మళ్లీ కోటేశ్వరుడి పుట్టలోంచి/బుస కొట్టేదే/ఈ దేశపు ప్రజాస్వామ్యం"** అన్నారు తిరుగుబాటు చైతన్యశీలిగా.


హైదరాబాద్ నగరం చేరిన తరువాత 'అలిశెట్టి', క్షయవ్యాధి తనను కబళిస్తుం చెక్కే ఉలి/ఆకలి అంటూ హైదరాబాద్ నగరంలో బతకడానికి వచ్చి ఎన్నో బాధలు పడుతూ, ఆకలి తీర్చుకోవడంతో కోసం అహర్నిశలు శ్రమించే పేద, మధ్య తరగతి జీవుల మనోగతాలను 'సిటీ లైఫ్' సంకలనంలో ఆవిష్కరించారు.

మరణం నా చివరి చరణం కాదని, సమరమే తన అంతిమ చిరునామా అని ఆవేదనాక్షరాల స్మృతి దీపం వెలిగించిన అలిశెట్టి ప్రభాకర్‌ను, 39వ ఏట నగరం మింగేసింది. విప్లవ ధిక్కార కవితా స్వరం వినిపించిన ప్రగతిశీల అభ్యుదయవాది, 1993 జనవరి 12న తన పుట్టిన రోజున కన్ను మూసారు. ఇక బతికే అవకాశం లేదని గ్రహించి 1992 జులైలో మరణానికి ముందు 'సిటీ లైఫ్' కొన్ని ఖండికలను పుస్తకంగా ప్రచురింపచేసారు. తెలుగు వచన కవితా సాహితీ రంగంలో, నాలుగు తరాల పాటు భవిష్యత్ కాలం గుర్తుపెట్టుకోదగిన, అలిశెట్టి ప్రభాకర్ (1954-1993)..

**చరిత్రకు రక్తపాతమే ఉపోద్ఘాతం**
**చరిత్రకు చెమటబొట్టే ఆధారం**
**చరిత్రకు ఆకలే ప్రేరణ**

అంటూ తెలుగు వచన కవితాకాశంలో అగ్నిశిఖ వెలుగు ప్రసరిస్తున్న, ఎర్ర పావురమై, మంటల జెండా యైన విప్లవ స్వాప్నికునిగా యిప్పటికీ ప్రభావితం చేస్తున్నారు.

**- జయసూర్య**



# నలుగురు అన్నదమ్ముల దర్శనం 'నాలాంబళం'

**శ్రీరామ నామం దివ్యమైనది. యుగాలు గడుస్తున్నా శ్రీరామచంద్ర ప్రభువును స్మరిస్తున్నాం. ఆ నామాన్ని జపిస్తున్నాం. అరణ్యవాసంలో ఆయన సంచరించిన ప్రదేశాలను చూసి తరిస్తున్నాం.**

సీతాదేవి, ఆయన సోదరుడు లక్ష్మణుడు అయోధ్యను వదిలి అరణ్యవాసం చేసిన రోజుల్లో భరతుడు అన్న పాదుకలను సింహాసనంపై ఉంచి పాలించాడు. కనిష్ఠ సోదరుడైన శత్రుఘ్నుడు అతడికి సహాయంగా ఉండేవాడు. అగ్రజుని మాటే వేదవాక్కుగా పరిగణించేవారు. అయితే దేశంలో ఏ రామ మందిరంలోనూ ఈ ఇద్దరి సోదరుల విగ్రహాలు పెద్దగా కనిపించవు. కానీ కేరళలో ఈ నలుగురు అన్నదమ్ముల ఆలయాలను మనం చూడొచ్చు. త్రిస్సూర్, ఎర్నాకుళం జిల్లాల్లో ఈ ఆలయాలను దర్శించుకోవచ్చు. ఈ యాత్రనే 'నాలాంబళం' యాత్ర అంటారు.

## 'నాలాంబళం' అంటే?

మలయాళంలో 'అంబళం' అంటే దేవాలయం. 'నాల్' అంటే నాలుగు. శ్రీరామునితో పాటు భరత, లక్ష్మణ, శత్రుఘ్న ఆలయాలను ఒకే రోజులో దర్శించుకోవడాన్ని 'నాలాంబళ యాత్ర' అని అంటారు. మలయాళ క్యాలెండర్ ప్రకారం కర్కాడకం నెలలో (జులై–ఆగస్టు) ఈ యాత్ర ఉంటుంది. ఒకే రోజులో యాత్రను పూర్తి చేస్తే భక్తులకు సకల శుభాలు కలుగుతాయని పురాణ గ్రంథాలవల్ల తెలుస్తోంది.



## శ్రీకృష్ణ భగవానుడు పూజించిన విగ్రహమూర్తులు

ద్వాపర యుగంలో శ్రీకృష్ణ భగవానుడు ఈ నాలుగు విగ్రహాలను పూజించాడని స్థల పురాణం. ద్వాపర యుగం చివరలో ప్రళయం ఏర్పడింది. ద్వారకా నగరం సముద్రంలో కలిసిపోయింది. ఈ విగ్రహాలు సముద్రంలో కొట్టుకువచ్చి కేరళ తీరంలోని చీటువ ప్రాంతంలో తేలాయి. వక్కయిల్ కైమల్ అనే స్థానిక మంత్రికి కలలో ఓ దివ్యమంగళ రూపం కనిపించి విగ్రహాల గురించి చెప్పింది. మరుసటి రోజు తీరానికి చేరుకున్న ఆయనకు స్థానిక మత్స్యకారులు విగ్రహాలను అందజేశారు. వీటిని వివిధ ప్రదేశాల్లో ప్రతిష్ఠించారు.

## శ్రీరామ దర్శనంతో..

ఈ యాత్రలో మొదటగా త్రిస్సూర్ జిల్లాలోని త్రిప్రయార్ ఆలయంలోని శ్రీరాముని దర్శనంతో ప్రారంభమవుతుంది. ఈ ఆలయంలో స్వామి ఆరడుగుల నిండైన విగ్రహంతో దర్శనమిస్తాడు. శంఖం, సుదర్శన చక్రం, పూలమాలను ధరించిన స్వామిని దర్శించుకోవడంతో యాత్ర ఆరంభమవుతుంది. తిరుఓనం రోజున ఆలయంలో సేతుబంధన మహోత్సవం నిర్వహిస్తారు. రాముణ్ణి దర్శించుకున్న తరువాత ఇరింజల్‌కుడలోని కూడల్ మాణిక్యం ఆలయానికి చేరుకోవాలి. ఇక్కడే భరతుని ఆలయం ఉంది. ఇక యాత్రలో మూడో ఆలయమైన లక్ష్మణ స్వామిని దర్శించుకునేందుకు ఎర్నాకుళం జిల్లాలోని అంగమాలి ప్రాంతంలోని మూళికులానికి చేరుకోవాలి. పూర్ణా నది సమీపంలో ఉన్న లక్ష్మణ్ పెరుమాళ్ ఆలయం ఉంది. ఇక్కడే హారిత మహర్షి తపస్సు చేశారని పురాతన గ్రంథాల వల్ల తెలుస్తోంది. రాముని సోదరుల్లో చిన్నవాడైన శత్రుఘ్నస్వామి ఆలయ సందర్శనంతో నాలాంబళ యాత్ర ముగుస్తుంది. ఇక్కడి విగ్రహం కూడా చిన్నదిగా వుండటం విశేషం. ఈ ఆలయం కూడా త్రిస్సూర్ జిల్లాలోనే ఉంది. అక్కడికి దగ్గర్లోనే ఉన్న హనుమంతుని దర్శనంతో యాత్రకు పరిపూర్ణత లభిస్తుంది.

## ఎలా చేరుకోవాలి..

రైల్లో వెళ్లేవారు త్రిస్సూరులో దిగి టాక్సీలు మాట్లాడుకోవాలి. సమీప విమానాశ్రయం కొచ్చిలో ఉంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రోడ్డు సౌకర్యం ఉంది. ❑



# వింతలకు నెలవు 'డెడ్ సీ'

షేక్ అబ్దుల్ హాకీం జాని

అనేక వింతలకు నెలవు మృత సముద్రం. దీనిని ఇంగ్లీషులో డెడ్ సీ అంటారు. మృత సముద్రానికి తూర్పు ఒడ్డు జోర్డాన్ వైపు ఉంటే, పశ్చిమ ఒడ్డు ఇజ్రాయెల్ వైపు ఉంటుంది. ఈ సముద్రంలోకి వచ్చి సంగమించే ఒకే ఒక్క నది జోర్డాన్ నది. మృత సముద్రం అనేది ప్రపంచంలోని అత్యల్ప సముద్రం. సముద్ర మట్టానికి 440 మీటర్ల దిగువన ఉన్నందువల్ల దీని విస్తీర్ణం అత్యల్పంగా ఉంటుంది. మృత సముద్రం దాని లవణీయత కారణంగా కూడా ప్రసిద్ధి చెందింది. ప్రపంచంలోనే అత్యధిక ఉప్పునీరు ఉన్న సముద్రం ఇదే. ఈ సముద్రం చుట్టూ ఒక్క పక్షి, చేప, మొక్క కూడా లేవు. సముద్రంలోని ఉప్పునీరే దీనికి గల కారణం. దాని నీటిలో ఏదీ మనుగడ సాగించలేదు. మృత సముద్రం భూమిపై అత్యధికంగా ఉప్పునీటిని కలిగి ఉన్న సముద్రం. దీని నీరు సాధారణ సముద్రపు నీటి కంటే 10 రెట్లు ఎక్కువ ఉప్పుగా ఉంటుంది. పిలవడానికి సముద్రం అని పిలిచినా, చుట్టూ నేల ఉన్నందున దీనిని నిజానికి సరస్సు అనాలి. కొందరు అలాగే పిలుస్తారు. కానీ నీటికి వున్న ఉప్పు లక్షణం వల్ల సముద్రంగా ప్రసిద్ధికెక్కింది. ఎందుకంటే జోర్డాన్ నదికి ఉన్న ప్రధాన ఉప నదులలో ఒకదాని నుండి నీరు మృత సముద్రంలోకి ప్రవేశిస్తుంది. దీని తరువాత ఆ ఉపనది నీరు సముద్రం నుంచి బయటికి వెళ్లే మార్గం లేదు. అందువల్ల ఈ నీరు సైతం ఉప్పగా మారిపోతుంది. వేలాది సంవత్సరాలుగా మృతసముద్రం మధ్యధరా సముద్రపు తీర ప్రాంతాల నుండి అనేకమంది యాత్రికులను ఆకర్షించింది. బైబిల్లో దావీదురాజు ఇక్కడే తలదాచుకున్నాడు. హేరోదు పాలనా కాలంలో ప్రపంచంలోనే మొట్టమొదటి హెల్త్ రిసార్ట్‌గా మృతసముద్రం పేరు తెచ్చుకున్నది. ఈజిప్ట ప్రజలు మమ్మీలను భద్రపరచడానికి ఉపయోగించిన లేపనాల నుండి ఎరువులలో వాడే పొటాష్ వరకు అనేక రకాల ఉత్పత్తులను మృత సముద్రం సరఫరా చేసింది. మృత సముద్రం నుండి లభ్యమయ్యే లవణాలు, ఖనిజాలు సౌందర్య సాధనాలు తయారు చేయటానికి ప్రజలు ఉపయోగించేవారు. మృత సముద్రంలో పలురకాల లవణాలు, ఖనిజాలు నీటిలో కరిగి ఉన్నాయి. వీటిలో సోడియం క్లోరైడ్, పొటాష్, మెగ్నీషియం క్లోరైడ్, బ్రోమైన్ ముఖ్యమైనవి. ఉప్పు సముద్రంలోని ఖనిజాలు మానవుడికి ఎంతో ఉపయోగపడతాయి. వాటిని గ్రహించి వెలికితీయగలిగితే మానవ కళ్యాణానికి అవి దోహదపడతాయి. ఇందులోని పొటాష్‌ను వేరు చేయగలిగితే అది ఎరువుల పరిశ్రమలో ఎరువుల తయారీకి ఉపయోగపడుతుంది. మృత సముద్రానికి సమీపంలో ఉన్న ఇజ్రాయెల్, జోర్డాన్, సిరియా, లెబనాన్ దేశాల్లో మంచినీరు విపరీతమైన ధర పలుకుతుంది. అధిక ధర పెట్టి మనం పెట్రోలు కొన్నట్లు అక్కడివారు తాగునీరు కొనుక్కుంటారు.



## మనుషులు మునగని మృత సముద్రం

మృత సముద్రంలో జలకాలాడటానికి దిగిన ఏ ఒక్కరూ మునగరు. ఈత రాకపోయినా ఈ సముద్రంలో తేలుతూ జలకాలాడవచ్చు. ఈ వింతను ఆస్వాదించడానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రతిరోజూ పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. ఇందులో కరిగివున్న అధిక లవణాల శాతం వల్ల మనిషి ఈ సముద్రంపై తేలుతూ ఉంటాడు. ఈ సముద్రంలో ఉప్పు, ఇతర లోహాల పరిమాణం అన్ని సముద్రాలతో పోలిస్తే చాలా ఎక్కువ. ఇందులోని నీటి సాంద్రత అత్యధికంగా ఉంటుంది. ఆ కారణంగా మనుషులు ఈ సముద్రం జలాలపై తేలుతూ పుస్తకాలు,



దినపత్రికలు చదువుకుంటుంటారు. మరికొందరైతే శీతల పానీయాలు సైతం సేవిస్తుంటారు. ఈ నీరు చర్మానికి మేలు చేస్తుందనే విశ్వాసంతో అనేకమంది ఇక్కడికి వచ్చి ఇందులో స్నానం చేస్తుంటారు. అయితే ఆ నీళ్ల కంటిలో పడకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. ఉప్పుశాతం అధికంగా ఉండటం వల్ల ఈ నీరు కంటిలో పడితే కళ్లు మండుతాయి. ఒక గ్లాసులో సగానికి పైగా ఉప్పు వేసిన తరువాత గ్లాసు నిండా నీరు పోసి, ఆ నీటిలో ఒక కోడిగుడ్డును ఉంచినట్లయితే ఆ గుడ్డు నీటిపై తేలుతుంది. గ్లాసులోని నీటిలో ఉప్పుశాతం అధికంగా ఉండటం వల్ల గుడ్డు నీటి ఉపరితలంపై తేలుతుంది. ఇదే విధంగా డెడ్ సీలో అత్యధికంగా ఉప్పుశాతం ఉండటం వల్ల మనుషులు నీటి ఉపరితలంపై తేలుతున్నారు. ఈ విధంగా తేలే బలాన్ని ఆంగ్లంలో బూయెంట్ ఫోర్స్ అని అంటారు. ఒక వస్తువును ద్రవంలో ఉంచినప్పుడు ఆ వస్తువుపై ఊర్ధ్వ బలాన్ని ప్రయోగిస్తుంది. ఈ బలాన్ని బూయెంట్ ఫోర్స్ అని అంటారు. ఉదాహరణకు మనుషులు నీటిలో దూకినప్పుడు ఆ నీరు వారిని ఉపరి తలంపైకి నెట్టేస్తుంది. దీనినే తేలే శక్తి అని అంటారు. డెడ్ సీ నీటి మధ్యలో కొన్ని చోట్ల ఉప్పు మేట వేసి రహదారిగా ఏర్పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఆ రహదారిపై పర్యాటకులు కేరింతలు కొడుతూ, పరుగులు తీస్తూ నీటిపై నడుస్తున్న అనుభూతిని పొందుతారు. మృత సముద్రం ఒడ్డున ఉప్పు బందరా ళ్లుగా ఏర్పడి పర్యాటకుల్ని ఆశ్చర్యచకి తుల్ని చేస్తుంది. 'మృత సముద్రంలో ఉప్పుశాతం విపరీతంగా ఉండడం వల్ల ఈ నీటి సాంద్రత 1.24 గ్రా. ఉంటుంది. అందుకే మనుషులు తదితర జీవులు మునగవు. ఈత కొట్టవలసిన అవసరం లేకుండానే నీళ్లలో తేలవచ్చు. మనుషులు మునగనంత మాత్రాన మిగతా వస్తువులు కూడా మునగవని అనుకోవడానికి లేదు. 'ప్లవన సూత్రాల ప్రకారం ద్రవాల సాంద్రత కన్నా వస్తువుల సాంద్రత ఎక్కువయితే ఆ వస్తువులు ఆ ద్రవంలో మునుగుతాయి, తక్కువయితే తేలుతాయి'. కనుక 1.24 గ్రా. కన్నా ఎక్కువ సాంద్రత ఉన్న ఇనుము, రాళ్లు వంటివి మృత సముద్రంలో తప్పకుండా మునుగుతాయి.

## పర్యాటకుల్ని ఆకర్షిస్తున్న మృత సముద్రం

ప్రపంచం అనేక వింత ప్రదేశాలతో నిండి ఉంది. వాటిని సందర్శించేందుకు ప్రతి సంవత్సరం పెద్ద సంఖ్యలో పర్యాటకులు వెళ్తుంటారు. అయితే ఈ ప్రదేశాల గురించి పర్యాటకులలో అనేక సందేహాలు తలెత్తుతాయి. అటువంటి వింత ప్రదేశాలలో 'డెడ్ సీ' ఒకటి. ఇక్కడి వింతలు, విశేషాలు తెలుసుకునేం దుకు ప్రతి సంవత్సరం లక్షల సంఖ్యలో పర్యాటకులు వస్తూ ఉంటారు.

## జీవరాశులు లేని మృత సముద్రం

ఈ భూగోళం మూడు వంతులు నీటితో నిండి ఉందనే విషయం అందరికీ తెలిసిందే. అంటే అన్ని వైపులా సముద్ర జలాలతో నిండి ఉన్నాయి. భూమి మీద ఎన్ని జీవరాశులు నివసిస్తున్నాయో అంతకంటే ఎక్కువ సముద్రంలో జీవిస్తున్నాయి.

అయితే ఏ జీవరాశి లేని సముద్రం ఒకటి ఉంది. అదే మృత సముద్రం. దీన్నే డెడ్ సీ, సాల్ట్ సీ అని కూడా పిలుస్తారు. ఈ సముద్రంలో లవణాల సాంద్రత చాలా ఎక్కువ. ఎంత ఎక్కువ అంటే ఆ సాంద్రత వల్ల జీవం అనేది అక్కడ ఉనికిలో ఉండడం చాలా చాలా కష్టం. చిక్కని లవణాల వల్ల చేపలు లాంటి సముద్ర జీవులు బతకలేవు. చివరికి సముద్ర జలాల్లో కనిపించే మొక్కలు కూడా అక్కడ బతకవు. అందుకే దానిని డెడ్ సీ అంటారు. దీంట్లో సముద్రాలలో కన్నా లవణీయత పది రెట్లు ఎక్కువ. అంటే ఉప్పు వంటి అనేక లవణాల గాఢత విపరీతంగా ఉండడం వల్ల ఇందులో చేపలు, తిమింగలాలు, నాచు, కోరల్స్ వంటి పెద్ద జీవజాతులు బతకలేవు. అందుకే దీన్ని మృత సముద్రం అన్నారు. కేవలం తక్కువ స్థాయిలో కొన్ని బ్యాక్టీరియాలు, ఫంగస్ జీవులు ఉంటాయి.

ఇది ప్రపంచంలో అత్యంత లోతైన ఉప్పునీటి సరస్సు. ఏవైనా జీవులను ఈ సముద్రంలో వదిలినట్లయితే అవి కచ్చితంగా చనిపోతాయి. హిబ్రూలు దీనిని సాల్ట్ సీ అని పిలిచేవారు. అంటే ఉప్పు సముద్రం అని అర్థం. ప్రతి సముద్ర జలాలూ



ఉప్పగానే ఉంటాయి. ఇందులోని ప్రత్యేకత ఏమిటంటే అన్ని సముద్రాల కన్నా అత్యధికంగా ఉప్పును కలిగి ఉంటుంది. మన ప్రాంతాలలో ఉప్పును మడులు కట్టి తయారు చేస్తారు. మృత సముద్ర తీరంలో ఉప్పు పేరుకుని ఉంటుంది. దీన్ని బట్టి ఈ ఉప్పు సముద్రంలో ఎంత ఉప్పునీరు ఉంటుందో సునాయాసంగా అవగతమౌతుంది.

డెడ్ సీ చాలా చిన్నదని చెప్పాలి.



తోంది. కనీసం ఆవిరయ్యే నీటితో పోల్చినా నదిలోంచి వచ్చే నీరు తగ్గిపోతోందట. ఫలితంగా అసలే చిన్నదైన మృత సముద్రం ఇంకా ఇంకా చిక్కబడుతోంది. నీటి ఒడ్డు ఇంకా ఇంకా వెనక్కి, లోపలికి, కిందికి వెళ్లిపోతోంది. 1950లతో పోలిస్తే ఇప్పటి మృత సముద్రంలో నీటిమట్టం 130 అడుగులు తగ్గిపోయిందని అంచనా. సముద్రం ఒడ్డుతో పోలిస్తే మిగిలి ఉన్న నీటి మట్టం 1407 అడుగుల లోతున ఉంటుందని అంచనా వేశారు. నీటి మట్టానికి అత్యంత లోతైన నేల

మృత సముద్రం 67 కిలోమీటర్ల పొడవు, అత్యంత వెడల్పైన ప్రదేశంలో 18 కిలోమీటర్ల వెడల్పు మేరకు విస్తరించి ఉంది. ఇది జోర్డాన్ రిఫ్ట్ లోయలో ఏర్పడింది. దీని ప్రధాన నీటివనరు జోర్డాన్ నది. ఇజ్రాయిల్, జోర్డాన్ దేశాల మధ్య డెడ్ సీ నెలకొని ఉంది. ఈ రెండు దేశాల మధ్య లోతైన గొయ్యి వంటి ప్రదేశంలో మృత సముద్రం ఉంది. 'డెడ్ సీ' అని పిలిచే మృత సముద్రం మిగతా సముద్రాలతో సంబంధం లేకుండా ఒక పెద్ద కొలనులాగా ఉంటుంది.

ఒకప్పుడు కొన్ని మిలియన్ల ఏళ్ల క్రితం అన్ని సముద్రాల్లో వలె డెడ్ సీలో సైతం జీవరాసులు నివసించేవి. ఈ సముద్రం ప్రస్తుతం ఉన్నదానికన్నా 420 మీటర్ల ఎత్తులో ఉండేది. అంటే మామూలు సముద్రాల కన్నా 20 మీటర్లు ఎత్తులో ఉండేదన్నమాట. కాలక్రమంలో జరిగిన మార్పుల వల్ల సముద్ర ప్రాంతంలో ఉష్ణోగ్రత పెరిగి అధిక శాతం నీరు ఆవిరైపోయింది. అందువల్ల అందులో నీరు బాగా తగ్గిపోయింది. సాధారణంగా సముద్రాల్లో ఉప్పు 5 నుండి 6 శాతం వరకు ఉంటుంది. మృత సముద్రంలో మాత్రం 23 నుండి 25 శాతం వరకు ఉంటుంది.

ఈ కారణంగా డెడ్ సీలో ఏ జీవీ బతకలేదు. ఉప్పు సముద్రంలో కాల్షియం నూనెలా జిడ్డుగా అనిపిస్తుంది.

జోర్డాన్‌లోని నది చిన్న పాయల నుండి చేపల వంటి కొన్ని జీవులు వచ్చి డెడ్ సీలో చేరతాయి. ఇలా చేరగానే అవి చనిపోతాయి. సముద్ర పక్షులు, వేటాడే అవసరం లేకుండా లొట్టలేసుకుంటూ ఆ చనిపోయిన చేపలను తినేస్తాయి. మృత సముద్రంలో ఉన్న పొటాష్ బరువు 20



లక్షల టన్నుల పైబడి ఉంటుందని ఒక అంచనా. దీన్ని బట్టి దాని నీరు ఎంత ఉప్పగా ఉంటాయో సులభంగా అంచనా వేయవచ్చు.

### తగ్గుతున్న నీటిమట్టం

జోర్డాన్ నది నుండి మృత సముద్రంలో కలిసే నీరు గతంతో పోలిస్తే తగ్గిపో

(ప్రపంచంలో) ఇదేనని కూడా చెబుతున్నారు. సంవత్సరానికి మూడు అడుగుల చొప్పున నీరు తగ్గిపోతోందని మరొక అంచనా. ఈ కారణాల వల్ల మృత సముద్రం జీవులను చంపడంతో పాటు తానూ చచ్చిపోతోందని శాస్త్రవేత్తలు ఆందోళన పడుతున్నారు. ❑

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే!

మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి.

కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:

**ఎడిటర్, ఆదివారం వార్త**, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.

sunmagvaartha@gmail.com



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకండి. ఉద్యోగులకు చిన్న చిన్న సమస్యలు ఎదురవుతాయి. వారాంతంలో ఖర్చులు అధికంగా ఉంటాయి. అనుకున్న పనులు సాధించలేకపోవచ్చు, అంతమాత్రాన నిరాశ చెందకండి. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆకస్మికంగా కోర్టు వ్యవహారాలకు హాజరు కావాల్సి వస్తుంది. వ్యాపారుల్లో పోటీ ఏర్పడుతుంది.



## వృషభం

ఉద్యోగ ప్రయత్నం ఫలిస్తుంది. వాహన యోగం. దంపతుల మధ్య సఖ్యత ఏర్పడుతుంది. వృత్తి వ్యాపారులకు సామాన్యంగా ఉంటుంది. జాయింటు వ్యవహారాలు పరిష్కారమవుతాయి. స్థిరాస్తులు కొనుగోలు చేసే సూచనలున్నాయి. ప్రముఖులను సందర్శిస్తారు. నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారులు రుణాలు చేయాల్సి వస్తుంది.

## మిథునం



వృత్తి రంగాల్లో వున్నవారికి ఖర్చులు అధికం. బంధు, మిత్రులను కలుసుకుంటారు. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయులను కలుసుకుంటారు. గృహ సౌఖ్యం. సంతానాభివృద్ధి సంతృప్తినిస్తుంది. వాహన యోగం. ఆరోగ్యం కుదుట పడుతుంది. భాగస్వామ్య వ్యాపారస్తులు సామరస్యంతో విడిపోతారు. ఉద్యోగులకు బాగుంటుంది.



## కర్కాటం

విదేశీ వస్తువులపై మక్కువ ఏర్పడుతుంది. శత్రువుల వల్ల సమస్యలు ఎదురయ్యే సూచనలున్నాయి. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. వ్యాపారులకు సామాన్యంగా ఉంటుంది. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు. వ్యాపారులకు శ్రమ పెరుగుతుంది. ఆరోగ్య సమస్యలుంటాయి. కుటుంబ గౌరవం ఇనుమడిస్తుంది. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి.

## సింహం



ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. విదేశీ వస్తువులు కొనుగోలు చేస్తారు. విలాసవంతమైన జీవితం పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. స్త్రీల వల్ల సమస్యలు ఎదురయ్యే అవకాశాలున్నాయి. సామాన్య ధన లాభం. క్రయ-విక్రయాలు లాభదాయకంగా ఉంటాయి. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది.



## కన్య

భాగస్వామ్య వ్యాపారులు విడిపోతారు. ఉద్యోగులకు ఆశించిన ఫలితాలుంటాయి. వృత్తి రంగాల్లో వున్నవారు రుణాలు చేయాల్సి వస్తుంది. సంతానాభివృద్ధి గురించి ఆలోచిస్తారు. అకారణంగా మనోవేదనకు లోనవుతారు. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం మంచిది. బంధు, మిత్రులతో స్వల్ప అభిప్రాయ భేదాలు వచ్చే సూచనలున్నాయి.

## తుల



విద్యార్థులకు శుభ యోగం. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. వృత్తి రంగాల్లో వున్నవారికి ఆశించిన ఫలితాలుంటాయి. ఆకస్మిక సంఘటనలు జరుగుతాయి. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. ఉన్నతాధికారులతో మాట్లాడేటప్పుడు సంయమనంతో వ్యవహరించండి. వారాంతంలో ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. శుభ కార్యాలను అనుకూలమైన సమయం. ప్రత్యర్థులపై విజయం సాధిస్తారు.



## వృశ్చికం

కుటుంబ సమస్యలు తీరి ప్రశాంతత ఏర్పడుతుంది. వృత్తి వ్యాపారులకు రుణాలు లభిస్తాయి. ఉద్యోగులకు ఆశించిన ఫలితాలుంటాయి. అన్ని వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. సామాన్య ధన లాభాలు పొందుతారు. ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆరోగ్య సమస్యలుంటాయి. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు అనుభవజ్ఞులను సంప్రదించడం అన్ని విధాలా మంచిది. వృథా ఖర్చులను నియంత్రించడంతో విఫలమవుతారు.

## ధనుస్సు



అన్ని వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. వారాంతంలో ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. అందుకు తగిన ఆదాయం కూడా లభిస్తుంది. ప్రతికూలతలు ఎదురైనా పనులు పూర్తి చేస్తారు. బంధు, మిత్రులతో మనస్పర్థలు వచ్చే సూచనలున్నాయి. అనుకున్న పనులు సకాలంలో పూర్తి చేయలేకపోవచ్చు. సోమరితనం దరి చేరనివ్వకండి. వృత్తి రంగాల్లో వారికి ఆర్థికంగా బాగుంటుంది. ఉత్సాహంగా గడుస్తుంది.



## మకరం

స్త్రీల వల్ల ఊహించని ఉపకారం లభిస్తుంది. పాత బాకీలు తీరుస్తారు. ఉద్యోగులకు స్థాన చలనం. ఆరోగ్య సమస్యలుంటాయి. ఆర్థికంగా బాగుంటుంది. గృహ లాభం. మీ శక్తి సామర్థ్యాలకు గుర్తింపు లభిస్తుంది. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. నేత్ర బాధలు ఉంటాయి. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. ఉద్యోగులకు పదోన్నతి. కళాకారులకు సన్మాన యోగం.

## కుంభం



ఉద్యోగులకు స్థాన చలనం. ఆరోగ్య సమస్యలుంటాయి. అనుకోని సంఘటనలు జరిగినా ఆత్మ స్థైర్యంతో ఎదుర్కొంటారు. గృహ సౌఖ్యం. శారీరక, మానసిక ఒత్తిడికి లోనవుతారు. వారాంతంలో రుణాలు చేయాల్సి వస్తుంది. బంధు, మిత్రులను కలుసుకుంటారు. రుణాలు తీరుస్తారు. ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించడం అత్యవసరం.

## మీనం



కుటుంబంలో మనస్పర్థలకు అవకాశం. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి. కంటి సమస్యలు ఉంటాయి. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. స్త్రీలతో మాట్లాడేటప్పుడు ఆచి తూచి వ్యవహరించడం మంచిది. వివాదాలకు దూరంగా వుంటే మంచిది. ఉద్యోగులకు పదోన్నతి లభిస్తుంది. ఆహార, ఆరోగ్య సలహాలు-సూచనలు తప్పనిసరిగా పాటించండి.

## రెండే దారులు

సుబ్బారావు(ఫోన్‌లో) షేర్ల ఎక్స్‌పర్ట్‌తో–

"సార్! నేను కొన్న కంపెనీ షేర్ల ధరలు పడిపోయాయి. ఇప్పుడు నేనేం చేయాలి?"

ఎక్స్‌పర్ట్: "ఇప్పుడు మీకున్నవి రెండే దారులు. ఒకటి: తూర్పు తిరిగి దండం పెట్టడం. రెండు: వాటిని అమ్మి దండం పెట్టడం. అయితే ఇందులో మీరు గమనించాల్సిన విషయం ఏమిటంటే– తూర్పు తిరిగి దండం పెట్టడం".

– **కె.లహరి,** కరీంనగర్

జోక్స్

## చక్కెర తింటే సరి..

ఓ వ్యక్తి హాస్పిటల్‌కు వెళ్లి బి.పి, షుగర్ చెక్ చేయించుకున్నాడు.

నర్స్: మీకు షుగర్ కొంచెం తక్కువగా ఉంది.

పేషెంట్: అయితే కొంచెం చక్కెర తింటే సరిపోతుందిగా!

నర్స్: ఆ..

## మల్లెపూలు ఇస్తుంటే..

"బాబాయ్! పిన్ని అప్పడాల కర్రతో మిమ్మల్ని ఎందుకు కొట్టింది?" అడిగాడు శేఖర్.

"ఏం లేదురా! నేను పక్కింటి దివ్యకు మల్లెపూలు ఇస్తుంటే మీ పిన్ని చూసింది. ఇక కొట్టక ఏం చేస్తుంది" అని నాలుక కరుచుకున్నాడు, దినేష్.

## ఏ.సి. పనిచేయడం లేదు

"అదేంటి గురూ! ఈ మధ్య ఆఫీసుకు రెగ్యులర్‌గా వస్తున్నావ్! అసలు ఒక్క సెలవు కూడా పెట్టడం లేదు" అడిగాడు తోటి ఉద్యోగి వెంకటేష్.

"ఇంట్లో ఏసి పని చేయడం లేదు.. అందుకని" తాపీగా చెప్పాడు కిషన్.

## ఓనర్ కాపలా ఉన్నారు

"డియర్! ఈరోజు గులాబిపువ్వు తేలేదు" చిలిపిగా అడిగింది భార్య.

"ఈరోజు ఇల్లుగలవారు గుమ్మంలో నిల్చుని చెట్లకు కాపలా కాస్తున్నారు".

– **దండెం రాజయ్య,** దోర్నకల్

నాగ్: రోజూ మీ ఇంట్లో టిఫిన్ దోసేనా? మీ ఆవిడకి ఇంకేమీ చేయడం రాదా? అడిగాడు స్నేహితుడ్ని నాని.

నాని: అబ్బే అదేం కాదురా. నాకే ఇంకేమి చేయడం రాదురా.

నాగ్: ఆ...!

## పెద్దయ్యాక..

పండు: మమ్మీ! నేను పెద్దయ్యాక నిన్ను అడగకుండా బయటికి వెళ్తాను.

మమ్మీ: మీ నాన్ననే నన్ను అడగకుండా బయటకి వెళ్లేంత పెద్ద అవలేదురా పండూ.



## బి.పి.పెంచుకోకండి

భార్య: ఏమండీ! నేను చెప్పేది జాగ్రత్తగా వినండి.. బి.పి. పెంచుకోవద్దు.




భర్త: నస ఆపి విషయం చెప్పు.

భార్య: మరేమీ లేదండి గ్యాస్ అయిపోయింది.

## చిరునామా

లిఖిత: విజయా! కొరియర్‌వాడికి లవ్ లెటర్ ఇస్తే ఏమన్నాడు?

విజయ: చిరునామా రాయకుండా ఇచ్చిన లెటర్ తీసుకోడట.

## బ్యాలెన్స్ లేదేమో!

రజని: ఒరే పండూ! మీ డాడీ ఇంకా లేవలేదు. ఒకసారి వెళ్లి చూడు.

పండు: డాడీ ఫోన్‌లో నెట్ బ్యాలెన్స్ అయిపోయిందేమో మమ్మీ!

## దైవంతో సమానం

లక్ష్మి: డాక్టర్‌గారూ! మీరు నాకు దైవంతో సమానం. మా అత్తగారికి మీరు మందులు ఇచ్చారు.

డాక్టర్: చాలా సంతోషం. మీ అత్తగారు బాగున్నారా?

లక్ష్మి: నేను బాగున్నాను, మా అత్తగారు చనిపోయారు డాక్టర్.

## సొంతిల్లు ఎలా రాస్తారు?

వనజ: మీకు నా మీద కొంచెం కూడా ప్రేమ లేదు. నా మీద ప్రేమ ఉంటే ఈ ఇల్లు నా పేరు మీద రాసేవారు.

ప్రభు: ఇది అద్దె ఇల్లు కదా ఎలా రాస్తాను?

వనజ: అద్దె ఇల్లే రాయలేనివాళ్లు సొంత ఇల్లు నా పేరు మీద రాస్తారా?

ప్రభు: ఆ....?!

– **ఈ.ఎస్.మాధవన్**

## హాస్య కవిత

నీ ఒయ్యారాల నడకలకు
దాసుడనయ్యాను
నీ అడుగులో అడుగులేస్తూ
ముందుకు నడిచాను
నువ్వు చక్కిలిగింతలు పెడితే
ఏమో అనుకున్నాను
నువ్వు విడిపోయిన తరువాత
జేబు చూసుకుంటే
గుండె ఝల్లుమంది.

– వైదా ఈశ్వరరావు,
విశాఖపట్నం

## సరదా రచనలకు ఆహ్వానం

ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి.
మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080. **sunmagvaartha@gmail.com**

# మౌనమే నీ భాష

వసంతకుమార్ సూరిశెట్టి

**"సార్.. మీరూ, మీ ఆవిడ ఎప్పుడైనా గొడవ పడ్డారా?" అంటూ అడిగాడు నా పక్క సీట్లో వున్న గోపాల్.**

**వాడికి ఈ మధ్యే పెళ్లి అయ్యింది.**

"భలేవాడివోయ్! మొగుడూ, పెళ్లాలన్నా తర్వాత గొడవలు వుండవా? తిట్టుకోవడం వుండవా? అలగడాలుండవా చెప్పు".

"గొడవలు రాకుండా వేరే దారేదీ లేదా గురూజీ!" అంటూ మళ్లీ అడిగాడు గోపాల్ దీనంగా.

"అడిగావు కాబట్టి నీకో రహస్యం చెబుతాను, విను. మాకు పెళ్లి అయిన కొత్తలో మా ఇద్దరికీ అస్సలు పడేది కాదు. నేను ఏదైనా ఒక మాటంటే తను రెండు మాటలు మాట్లాడేది. నేను రెండు మాటలు మాట్లాడితే తను నాలుగు మాటలు మాట్లాడేది. అలా మాటా మాటా పెరిగి పెద్ద గొడవ అయిపోయేది. రోజూ మాకు కొట్లాడుకోవడంతోనే సరిపోయేది.



సరిగ్గా ఆ సమయంలోనే మా పక్కింట్లో ఓ జంట దిగింది. ఇద్దరూ మధ్య వయస్కులే. వాళ్లు పక్కింట్లోకి వచ్చిన దగ్గర్నించీ వాళ్లని గమనిస్తూనే వున్నాను. వాళ్లు ఒక్కరోజూ దెబ్బలాడుకున్నట్టు కనిపించలేదు నాకు. చాలా ఆశ్చర్యమేసింది. అదెలా సాధ్యమో తెలుసుకుందామని ఓ రోజు పక్కింటాయన్ని వాళ్లావిడ లేని సమయంలో కలిసాను. నన్ను నేను పరిచయం చేసుకుని "సార్! మీరు వచ్చిన దగ్గర్నించి చూస్తున్నాను. మీరు ఒక్కరోజూ దెబ్బలాడుకోవడం చూడలేదు. చాలా చిత్రంగా వుంది. అదెలాగో నాక్కొంచెం చెప్పి పుణ్యం కట్టుకోరూ" అంటూ అడిగాను.

అందుకాయన "దానికి నా ఒక మందు వుంది. అది పుచ్చుకుంటే జన్మలో దెబ్బలాటలు రావు" అన్నాడు.

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. దీనికీ మందులుంటాయనేసరికి.

"సార్! ఆ మందు నాక్కూడా కావాలి. ఎంత ఖరీదైనా పరవాలేదు. ఎక్కడ దొరుకుతుందో చెప్పి పుణ్యం కట్టుకోండి సార్!" అని ఆత్రుతగా అడిగాను.

"భలేవారే! మీ లాంటి వారికోసమే చాలా మందు కొని దాచి వుంచాను. దానిలో నించి కొంచెం ఇస్తాను ఆగండి" అని లోపలికి వెళ్లి ఒక బాటిల్‌నిండా మందుతో తిరిగివచ్చి చేతికిచ్చాడు.

"ఈ మందుని ఎలా వాడాలి?" అని అడిగాను.

"ఏంలేదు.. మీ ఆవిడ గొడవ ప్రారంభించిన వెంటనే ఈ మందుని నోటిలో పోసుకోవాలి కానీ తాగకూడదు. ఓ పది నిమిషాలు అలాగే నోట్లో వుంచుకోవాలి. ఆ తర్వాత మింగేయాలి" అని చెప్పాడు.

ఆయనకి థాంక్స్ చెప్పి ఇంట్లో కాలు మోపేసరికి "ఉదయాన్నే ఏం వెలగబెట్టి వస్తున్నారు? ఇక్కడ ఒక్కదాన్నే పనులు చేసుకోలేక చస్తుంటే. ఊరి మీద షికార్లు కొట్టి వస్తున్నారా?" అంటూ ప్రారంభించింది మా ఆవిడ.

వెంటనే ఆ మందుని అందుకుని నోట్లో పోసుకుని పది నిమిషాల తర్వాత మింగేసాను.

ఈ లోపల ఆవిడ అరవడం ఆగిపోయింది. మందు బాగా పని చేసిందనుకున్నాను.

ఆ తర్వాత గొడవ వస్తుందని తెలిసిన వెంటనే ఈ మందుని నోట్లో పోసుకునేవాడిని. గొడవలు ఆగిపోయేవి. మందు బాగా పని చేస్తోంది. ఇంకా కొంచెం అడిగి తెచ్చుకుంటే బాగుంటుందని మళ్లీ పక్కింటాయన దగ్గరికి వెళ్లాను.

"సార్! మందు బాగా పని చేస్తుంది. ఎంత ఖరీదైనా పరవాలేదు. ఎక్కడ దొరుకుతుందో చెప్పండి" అన్నాను.

ఆయన పకపకా నవ్వి "అది మందు కాదు, పచ్చి మంచినీళ్లే" అన్నాడు.


"ఏమిటి? మంచినీళ్లా! మా గొడవల్ని ఆపింది.." అన్నాను ఆశ్చర్యపోతూ.


"మంచినీళ్లు ఆపలేదు. నీళ్లని నోటిలో వుంచుకోవడం వల్ల మీ భార్య మాటకి ఎదురుచెప్పకుండా వుండడం వల్ల కొంచెంసేపటికి ఆవిడ నోరు మూసుకునేది. అలా మీ మధ్య గొడవలు ఆగిపోయాయి. రెండు నోళ్లు కలిస్తేనే గొడవలు పెద్దవవుతాయి. ఒకళ్లు కామైపోతే గొడవలుండవు కదా!" అన్నాడు శ్రీకృష్ణ పరమాత్ముడిలా.


నేను చెప్పడం ముగించేసరికి పరిష్కార మార్గం దొరికిందన్నట్టుగా మొఖం వెలిగిపోయింది మా గోపాల్‌కి.



# ఈ వారం కా‘ర్ట్యూన్స్’


సమాజం లోని కుళ్ళుని చూడలేక పోతున్నా..?
గుడ్లు పీకెయ్యాలా..? ఏం.. కుళ్ళుని వదిలేసి
ఉన్న మంచిని చూడ్డానికేం రోగం..?!!
2023
Zakir...


అన్ని OTT లకు డబ్బులు కట్టి.. కట్టిన డబ్బులు వేస్ట్
అవుతాయని.. రాత్రంతా కూర్చుని సినిమాలు చూస్తున్నారు...!!
డాక్టర్..
Zakir...


ఉన్న ఒకెకరం అమ్మేసి ‘క్రిప్టో కరెన్సీ’లో పెట్టాడు..
అప్పటి నుండి ‘సూట్’ వేసుకుని తిరుగుతున్నాడు...!!
Zakir...







కొలంబియాలోని మెడెలిన్ అనే నగరంలోని కమునా13 అనే ప్రాంతానికి సంబంధించిన చిత్రాలివి. ఇక్కడి ప్రజలు ఎక్కడికి వెళ్లాలన్నా ఎస్కలేటర్లు వాడాల్సిందే. రద్దీగా, ఇరుకైన దారులు వుండడం వల్ల వాహనాలు నడపడం వీలు కాదు. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, షాపింగ్స్ మాల్స్‌లో ఉండే ఎస్కలేటర్లు ఇక్కడ నిత్యం ప్రజారవాణాకు ఉపయోగిస్తున్నారు. ఎత్తయిన ఓ కొండ మీద వుండే ఈ ప్రాంతం ఇప్పుడు పర్యాటక ప్రాంతంగా మారిపోయింది.



